ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి



తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

శుక్రవారం 14 ఫిబ్రవరి 2025 | 5



ఏదో.. ఫీలింగ్!



నేడు ప్రేమికుల దినోత్సవం

అనంతమైన ఆనందం.. అంతకుమించిన మాధుర్యం.. జీవితమంత అమృతం.. గుప్పెడంత గుండెలో ప్రమాణం.. కంటికి కనిపించని భావన.. అదొక అంతులేని కావ్యం.. రాయలేనన్ని అనుభవాల ప్రవాహం.. ఇలా ఎన్నో ఎన్నెన్నో ఆ రెండు అక్షరాల్లో ఇముడ్చుకొని విశ్వాన్ని ఏలుతోంది. అదే.. ప్రేమ. రెండు మనసులను ఒక్క క్షణంలో కలిపి ఏడుడగులు వేయించి జీవితమంతా ఒకరికొకరు తోడూనీడగా నడిపించే మహత్తర శక్తి ఈ ప్రేమ. దాని గురించి నిర్వచనం చెప్పాలంటే అనిర్వచనీయమే. ఏదో తెలియని ఫీలింగ్.. ఫీలింగ్. ప్రేమకోసం అందరూ పరితపిస్తారు. దానికోసం ప్రాణానికికన్నా మిన్నగా పోరాడతారు. కానీ కొందరే ప్రేమను జయిస్తారు. నిజానికి ప్రేమ కథలంటే అందరికీ ఇష్టమే. ఈ ప్రేమికుల దినోత్సవాన కొన్ని ప్రేమ కథలను మీరూ చదివేయండి మరి! 6



వైభవంగా నరసన్న తెప్పోత్సవం, పుష్పోత్సవం







గురువారం రాత్రి జరిగిన స్వామి వారి పుష్పోత్సవం.. (పైన) తెప్పోత్సవ దృశ్యం

ముగిసిన అంతర్వేది కల్యాణ ఉత్సవాలు 6

జలకళకు నిధులు!



- ఏటిగట్లు, అవుట్‌ఫాల్ స్లూయిజ్‌లకు రూ.54.57 కోట్లు మంజూరు
- ఓఅండ్ఎం పనులకు రూ.70.01 కోట్లతో 953 ప్రతిపాదనలు
- నాబార్డు నిధులు రూ.257 కోట్లతో 322 పనులకు ఆధునికీకరణ
- రబీకి నీటి ఎద్దడి లేకుండా ప్రయత్నం : ఇరిగేషన్ ఎస్ఈ కె.గోపీనాథ్

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ ప్రభుత్వం హయాంలో ఇరిగేషన్ వ్యవస్థను నిర్వీర్యమైంది. వేసవిలో కనీసం కాలువల్లో పూడిక కూడా తీయని పరిస్థితి ఉండేది. డెల్టా ఆధునీకరణ పనులు అసలు పట్టించుకోలేదు. వరదల సమయంలో ఏటిగట్లకు తాత్కాలిక పనులకోసం కూడా నానా ఇబ్బందులుపెట్టేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇరిగేషన్ వ్యవస్థకు పూర్వవైభవం తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే వరదగట్ల అభివృద్ధి, అవుట్‌ఫాల్ స్లూయిజ్‌ల పటిష్ఠతకు రెండు విడతలుగా రూ.54.57 కోట్లు మంజూరు చేశారు. అందులో ఇప్పటికే కొన్ని పనులు ప్రారంభంకాగా, కొన్ని టెండర్ల దశలోనూ, కొన్ని సాంకేతిక అనుమతుల దశలోనూ ఉన్నాయి. ఇంకా అవుట్‌ఫాల్ స్లూయిజ్‌లతోపాటు గ్రోయిన్లు, డెల్టా ఆధునికీకరణ తదితర పనులకు రూ.257 కోట్ల నాబార్డు నిధులతో 322 పనులు ప్రతిపాదించి ప్రభుత్వానికి పంపించారు. అలాగే కాలువల క్లోజర్ సమయంలో ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓఅండ్ఎం) పనులు చేయడానికి రూ.70.01 కోట్లతో 953 పనులు ప్రతిపాదించారు. ప్రస్తుత ఇరిగేషన్ పరిస్థితి మీద ఇటీవల కొత్తగా బాధ్యతలు చేపట్టిన ధవళేశ్వరం ఇరిగేషన్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ కె.గోపీనాథ్‌తో 'ఆంధ్రజ్యోతి'తో పలు విషయాలు ప్రస్తావించారు.

- **రబీ సాగుకు నీటి లభ్యత ఏంటి..**

ఎస్ఈ : ఇబ్బంది ఉండదనే భావిస్తున్నాం. మొత్తం రబీ, మంచినీటి అవసరాలు, చేపల చెరువులకోసం 84 టీఎంలు అవసరం. ఇప్పటికే 41 టీఎంసీలు వినియోగించారు. ఇంకా మార్చి 31వ తేదీ వరకూ 43 టీఎంసీలు అవసరం. ప్రస్తుతం సీలేరు నుంచి 7,300 క్యూసెక్కుల నీరొస్తోంది. మొత్తం అక్కడ నుంచి 10 టీఎంసీల నీరు ఇస్తా మనే హామీ ఉంది. పోలవరం స్పిల్‌వే నుంచి 15 టీఎంసీలు వస్తాయి. సెల్ఫ్‌లో 2.38 టీఎంసీలు ఉన్నాయి.

- **మిగతా నీటికోసం యాక్షన్ ప్లాన్..**

ఎస్ఈ : జిల్లా నీటిపారుదల అభివృద్ధి సంస్థ సమీక్ష నాటికి నీరు పుష్కలంగా ఉందనే అంచనాతో యాక్షన్ ప్లాన్ ఏమీ సిద్ధం చేయలేదు. సీలేరులో వాస్తవానికి 67 టీఎంసీల నీరు ఉంది. అవసరమైతే ప్రభుత్వ సహాయంతో మరికొంత తెచ్చే ప్రయత్నం చేస్తాం. నిజంగా శివారు ప్రాంతాల్లో ఎక్కడైనా ఎద్దడి వస్తే అప్పటికప్పుడు నిర్ణయాలు తీసుకోవడానికి కాకినాడ కలెక్టర్ సుముఖత తెలియజేశారు. మిగతా జిల్లాల కలెక్టర్లకు కూడా పరిస్థితిని వివరించి నీటి ఇంజన్లు ఏర్పాటు, క్రాస్‌బండ్‌ల నిర్మాణం వంటి పనులు చేస్తాం.

- **క్లోజర్ సమయంలో కాలువల పనులకు యాక్షన్ ప్లాన్ ఏమైనా ఉందా?**

ఎస్ఈ : 953 పనులు చేయడానికి రూ.70.01కోట్లతో ప్రతిపాదనలు పంపాం. వాటితో ఆపరేషన్, మెయింటెనెన్స్ పనులు చేస్తాం.

- **వరదల సమయంలో ఈసారి ముఖ్య పనులు చేసే పరిస్థితి ఏమైనా ఉందా?**

ఎస్ఈ : డిజాస్టర్ మేనేజ్‌మెంట్ నిధుల కింద ఇప్పటికే రెండు దఫాలుగా నిధులు మంజూరుచేశారు. మొదట విడతలో 37.57 కోట్లను 73 పనులు చేయడానికి ఇచ్చారు. వీటితో ఏటిగట్ల పటిష్ఠత, అవుట్‌ఫాల్ స్లూయిజ్‌ల అభివృద్ధి చేయనున్నాం. అంతేకాక పంపా నది స్పిల్‌వే గేట్లు రీప్లేస్‌మెంట్ పనులు కూడా ఉన్నాయి. ఈ పనులకు టెక్నికల్ శాంక్షన్ వచ్చిన వెంటనే టెండర్లు పిలుస్తాం. కాజ, నర్సాపురం ప్రాంతంలోని కాజ, మడుగుల తూము తదితర ప్రాంతాల్లో అవుట్‌ఫాల్ స్లూయిజ్‌లను మరమ్మతులు చేస్తాం. ఇవి టెండర్ల దశలో ఉన్నాయి. ఇటీవల డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కింద రెండో విడత రూ.17 కోట్లు వచ్చాయి. వాటితో రాజోలు సబ్ డివిజన్‌లో అంతర్వేది పరిధిలోనూ, లూటుకుర్రు, ఆదుర్రు అవుట్‌ఫాల్ స్లూయిజ్‌లు మరమ్మతులు చేయవలసి ఉంది. వీటికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలి.

- **డెల్టా ఆధునీకీకరణ పనులేమీ లేవా?**

ఎస్ఈ : నాబార్డు నిధులు రూ.257 కోట్లతో 322 ఆధునికీకరణ పనులు చేయడానికి ప్రతిపాదించాం. వీటిలో చాలా అభివృద్ధి పనులను ప్రతిపాదించడం జరిగింది.

- **అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగా పనిచేస్తున్న లస్కర్లకు జీతాల సమస్య..**

ఎస్ఈ : నిధులు వచ్చాయి. ఈనెలాఖరుకి 2024-25కి సంబంధించిన మొత్తం బకాయిలు చెల్లిస్తాం. ఇక సమస్య ఉండదు.



ఇంకా 'సిట్' అవదా..

- కాకినాడలో రేషన్ బియ్యం స్మగ్లింగ్‌పై అతీగతీలేని సిట్
- ప్రత్యేక సిట్ బృందాన్ని నియమించి రెండు నెలలు దాటినా విచారణ ఏదీ
- దర్యాప్తు అసలు ఎప్పుడు మొదలవుతుందో కూడా తెలియని పరిస్థితి
- గతేడాది నవంబరు నెలాఖరులో స్టెల్లా షిప్‌లో పట్టుబడ్డ రేషన్ బియ్యం
- అప్పట్లో కొద్దిరోజులపాటు రేషన్ బియ్యం స్మగ్లింగ్‌పై అట్టుడికిన కాకినాడ
- డిసెంబర్ 6న సిట్ నియమించిన తర్వాత నుంచీ నెమ్మదించిన చర్యలు
- మరోపక్క సిట్ దర్యాప్తు మొదలవకపోవడంతో రేషన్ మాఫియాలో దర్జా
- తమకేం కాదనే ధోరణిలో మళ్లీ మొదలైన రేషన్ బియ్యం కొనుగోళ్లు

కాకినాడ కేంద్రంగా కొనసాగిన వందల కోట్ల రేషన్ బియ్యం మాఫియాపై సిట్ దర్యాప్తునకు అతీగతీ లేకుండాపోతోంది. ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని నియమించి నెలలకు నెలలు గడుస్తున్నా అసలు విచారణ ఊసే లేదు. ఈనేపథ్యంలో అసలు రేషన్ మాఫియాపై సిట్ రంగంలోకి దిగుతుందా లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కాకినాడ నుంచి రూ.8 వేల కోట్లకుపైగా విలువైన బియ్యం నౌకల్లో విదేశాలకు ఎగుమతైంది. ఇందులో సగాని కిపైగా రేషన్ బియ్యమే. అయితే స్టెల్లా నౌకలో గతేడాది నవంబరులో రేషన్ బియ్యం పట్టుబడ్డ నేపథ్యంలో వేళ్లూనుకుపోయిన మాఫియా బట్టబయలైంది. దీంతో రేషన్ స్మగ్లింగ్ గుట్టు తేల్చ డానికి ప్రభుత్వం డిసెంబరు 6న సిట్‌ను నియమించింది. ఇది జరిగి రెండు నెలలకుపైగానే దాటిపోయినా సిట్ విచారణకు అసలు దిక్కులేకుండా పోయింది. అప్పట్లో నౌకలో రేషన్ బియ్యాన్ని పట్టుకోవడానికి డిప్యూటీ సీఎం పవన్ రావడం, షిప్‌ను సీజ్ చేయాలని ఆదేశించడంతో రాష్ట్రవ్యాప్తంగా సంచలనమైంది. తీరా విచారణ ఊసే లేకపోవడంతో అక్రమార్కులు మళ్లీ చెలరేగిపోతున్నారు.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

పేదలకు అందాల్సిన రేషన్ బియ్యాన్ని వైసీపీ అక్రమార్కులు చెరబట్టేసి గడచిన అయిదేళ్లలో భారీగా విదేశాలకు తరలించేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా రహస్య నెట్‌వర్క్‌ను ఏర్పాటుచేసి రేషన్ బియ్యం పేదలకు ఇలా అందగానే.. అలా కిలోకు రూ.10 చెల్లించి లక్షల టన్నులు కాకినాడకు తరలించడమే పనిగా పెట్టుకున్నారు. ప్రధానంగా వైసీపీ అధికారంలో ఉన్న అయిదేళ్లలో కాకినాడ సిటీ వైసీపీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి కుటుంబం, ఆయన అనుచరులు బియ్యాన్ని కనివినీ ఎరుగని రీతిలో బొక్కేశారు. పౌరసరఫరాలశాఖ పరిధిలోని రేషన్ బియ్యం వ్యవస్థను కుళ్లబొడిచేశారు. ప్రభుత్వం వందలకోట్లు సబ్సిడీ చెల్లించి పేదలకు ఇచ్చే బియ్యాన్ని సదరు నేత, ఆయన మనుషులు కారుచౌకగా కొట్టేసి దాన్ని సార్టెక్స్ యంత్రాల్లో పాలిష్‌చేసి ఆకర్షణీయ ప్యాకింగ్‌ల్లో ఉంచి నౌకల ద్వారా ఆఫ్రికా దేశాలకు అమ్మేసుకుని వేలకోట్లు గడించారు. ఒకరకంగా చెప్పాలంటే వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 2019-2020లో కాకినాడ యాంకరేజ్ పోర్టు నుంచి 19 లక్షల మెట్రిక్ టన్నులు, 2020-21లో 27 లక్షల మెట్రిక్ టన్నులు, 2021-22లో 29లక్షల మెట్రిక్ టన్నులు, 2022-23లో 38లక్షల మెట్రిక్ టన్నులు, 2023-24లో 24లక్షల మెట్రిక్ టన్నులు తరలిపోయింది. ఇందులో రేషన్ బియ్యం సగానికిపైనే. అయితే గతేడాది నవంబరు ఆఖరులో కాకినాడ నుంచి పశ్చిమ ఆఫ్రికాదేశానికి స్టెల్లానౌకలో రహస్యంగా ఎగుమతికి సిద్ధంచేసిన రేషన్ బియ్యం పట్టుబడడంతో స్మగ్లింగ్ వ్యవహారం అధికారికంగా బయటకు వచ్చింది. దీనిపై డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కాకినాడకు వచ్చి స్వయంగా షిప్ వద్దకు వెళ్లారు. ఆ తర్వాత రేషన్ ఆనవాళ్ల కోసం వెదికితే కాకినాడ, చుట్టుపక్క ప్రాంతాల్లో అనేక గోదాముల్లో ఎగుమతికి సిద్ధంగా ఉన్న రేషన్ బియ్యం పట్టుబడింది. ఈనేపథ్యంలో వేళ్లూనుకుపోయిన రేషన్ బియ్యం స్మగ్లింగ్‌పై రాష్ట్రప్రభుత్వం గతేడాది డిసెంబరులో ఉక్కుపాదం మోపింది. మాఫియాను అంతమొందించి అక్రమార్కులను శిక్షించే విధంగా ప్రత్యేకంగా సిట్‌ను నియమించింది. రేషన్ బియ్యం కాకినాడకు నలుమూలల నుంచి ఎలా చేరుకుంటోంది? ఎవరు తరలిస్తున్నారు? ఎక్కడి నుంచి తరలిస్తున్నారు? అక్కడి నుంచి ఏయే గోదాముల నుంచి మిల్లులకు వెళ్లి పాలిష్ చేసుకుని ఏయే కంపెనీల ద్వారా నౌకల్లో విదేశాలకు తరలిపోనున్నాయనేదానిపై ఈ సిట్ బృందం దర్యాప్తు చేపడుతుందని పేర్కొంది. ఈ క్రమంలో దర్యాప్తులో భాగంగా నిందితులను తక్షణం అరెస్ట్ చేసే అధికారం సైతం కల్పిస్తూ ఆదేశాలు జారీ చేసింది. అలాగే కాకినాడ, చుట్టుపక్కల మొత్తం అయిదు పోలీసుస్టేషన్ల పరిధిలో గతేడాది జూన్, జూలై నెలల్లో 13 రేషన్ బియ్యం స్మగ్లింగ్ కేసులు నమోదయ్యాయి. వీటన్నింటిపై కూలంకషంగా దర్యాప్తుచేయాలని ఆదేశాల్లో ప్రభుత్వం పేర్కొంది. అయితే సిట్ బృందాన్ని నియమించిన నేపథ్యంలో అయిదు పోలీసుస్టేషన్ల పరిధిలోని 13 కేసులపై జిల్లా పోలీసులు సైతం లోతుగా విచారణ చేశారు. సిట్ దర్యాప్తునకు వస్తే తక్షణ నివేదిక ఇచ్చేలా వివరాలు సిద్ధం చేశారు. ప్రధానంగా కాకినాడ రూరల్ పోలీసుస్టేషన్ పరిధిలో జూలై 11న రూ.26కోట్లు, జూన్ 28న కాకినాడ రూరల్ నియోజకవర్గం కరప స్టేషన్ పరిధిలో రూ.13.96 కోట్ల విలువైన రేషన్ బియ్యం పట్టుబడింది. ఇది లవన్ కంపెనీదిగా గుర్తించారు. కొటారి అమిత్‌కుమార్ అనే వ్యాపారిని నిందితుడిగా తేల్చారు. అయితే ఇదే లవన్ కంపెనీ పశ్చిమ ఆఫ్రికాకు బియ్యం ఎగుమతి చేస్తుండగా బార్జిలో 1,060 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యంతో పట్టుబడింది. అదేరోజు కరప స్టేషన్ పరిధిలో రూ.15.31 కోట్ల బియ్యం పట్టుబడింది. ఇది ద్వారంపూడి ప్రధాన అనుచరుడైన వినోద్ అగర్వాల్‌కు చెందిన సరళ ఫుడ్స్ కంపెనీ. ఇలా సిట్ దర్యాప్తు చేయనున్న ఈ 13 కేసులకు సంబంధించి మొత్తం రూ.84.87 కోట్ల విలువైన 22,947 మెట్రిక్ టన్నుల బియ్యం పట్టుబడినట్లు పోలీసులు గుర్తించారు. ఇందులో ద్వారంపూడి అనుచరులే అధికంగా ఉండడం గమనార్హం. అయితే క్షేత్రస్థాయిలో పక్కా ఆధారాలు భారీగా ఉండడంతో ఆయా కంపెనీలకు పోలీసులు నోటీసులు కూడా పంపించారు. అయితే సిట్ దర్యాప్తు ప్రారంభిస్తే ఈ కేసుల ఆధారంగా నిందితులను తక్షణం అరెస్ట్ చేయడంతోపాటు వాటి వెనుక ఉన్న పెద్దతలలు సైతం సులువుగా దొరికే అవకాశం ఉంది. కానీ సిట్ రంగంలోకి దిగలేదు.

అక్రమార్కుల్లో ఎంచక్కా దర్జా..

రేషన్ స్మగ్లింగ్‌పై ఏకంగా సిట్ విచారణకు ఆదేశించడంతో బియ్యం అక్రమార్కులు వణికిపోయారు. పైగా సిట్‌కు అరెస్ట్‌ల అధికారం కట్టబెట్టడంతో తమ పాపం పండినట్లేనని భయపడ్డారు. ఇంతవరకు దాని ఊసే లేకపోవడంతో తమకేం కాదులే అనే ధోరణిలో ప్రస్తుతం మళ్లీ రేషన్ బియ్యం కొనుగోళ్ల మొదలుపెట్టారు. వాస్తవానికి సిట్‌ను నియమించిన తర్వాత అందులో ఉన్న కొందరు సభ్యులు గత వైసీపీ ప్రభుత్వానికి అడ్డంగా కొమ్ముకాసిన వారేనన్న విమర్శలు వచ్చాయి. దీంతో వీరిని మార్చి ప్రభుత్వం డిసెంబరు 27న మరో కొత్త సిట్‌ను నియమించింది. అందులో కొందరు పోలీసులను తప్పించి కాకినాడ జిల్లాలో బీసీ కార్పొరేషన్ అధికారి శ్రీనివాస్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో పౌరసరఫరాల సంస్థ డీఎం బాలసరస్వతిని నియమించారు. ఇంతవరకు ఆ ఊసే లేదు. అటు కొత్త సిట్‌లో సభ్యులుగా ఉన్న ఇద్దరు ఉమ్మడి జిల్లా అధికారుల్లోను అయోమయం కొనసాగుతోంది. తమను దర్యాప్తు బృందంలో సభ్యులుగా చేర్చినా విచారణకు సంబంధించి ఎలాంటి సమాచారం లేకపోవడంతో వారు అయోమయంలో కొనసాగుతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

జిల్లాలో 40 వేల హెక్టార్లలో ప్రకృతి వ్యవసాయం సాగుకు చర్యలు : కలెక్టర్

రాజమహేంద్రవరం రూరల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది 40 వేల హెక్టార్లలో ప్రకృతి వ్యవసాయం సాగు విస్తీర్ణం చేపట్టేలా చర్యలు చేపట్టి, ఆరోగ్యవంతమైన పంటలసాగు లక్ష్యంగా అడుగులు వేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ మనం తీసుకునే ఆహారం ఆరోగ్యవంతంగా ఉండాలంటే ప్రకృతి సిద్ధంగా పండించే ఆహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ప్రకృతి వ్యవసాయం దిశగా అడుగులు వేసే ప్రక్రియలో మూడేళ్లపాటు ఓపికగా ఉంటే ఎరువుల ద్వారా పండించే పంటలకు ధీటుగా దిగుబడులు సాధించవచ్చన్నారు. తర్వాత గోపాలపురంనకు చెందిన రైతు ఉండవల్లి రామకృష్ణ, దొమ్మేరుకు చెందిన రైతు సత్యనారాయణ, ఉండ్రాజవరంనకు చెందిన రైతు మురళి తెలిపారు. వీరితోపాటు పలువురు తమ అభిప్రాయాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్నరాయుడు, వ్యవసాయాధికారి మాధవరావు, జిల్లా హార్టీకల్చర్ అధికారి బి.సుజాతకుమారి, కేవీకే సమన్వయకర్త, శాస్త్రవేత్త డాక్టర్ యుఎస్ గోపాల్‌నాయుడు ప్రకృతి వ్యవసాయం సాగు చేసే రైతులు, అధికారులు పాల్గొన్నారు.

విజిబుల్, ఫ్రెండ్లీ పోలీసింగ్‌కి ప్రాధాన్యం ఇవ్వాలి: ఎస్పీ

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): విజిబుల్, ఫ్రెండ్లీ పోలీసింగ్‌కి ప్రాధాన్యం ఇవ్వడంతోపాటు విద్యాలయాలు, హోటల్స్ వంటి ప్రదేశాల్లో నిఘా పటిష్ఠం చేయాలని ఎస్పీ నరసింహ కిషోర్ ఆదేశించారు. గురువారం రాజమహేంద్రవరంలోని ప్రకాశ్‌నగర్ పోలీస్ స్టేషన్‌ని ఆయన తనిఖీ చేశారు. స్టేషను పరిసరాలను గమనించడంతోపాటు రికార్డులను పరిశీలించారు. స్టేషనుకు వచ్చే వారితో మర్యాదగా వ్యవహరించి సమస్యను పరిష్కరించే దిశగా సత్వర ప్రయత్నం చేయాలన్నారు. రాత్రి వేళల్లో గస్తీని పెంచాలని, బీట్ల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తుండాలని సూచించారు. రౌడీ షీటర్ల కదలికలను గమనిస్తూ అవసరమైతే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించడం వంటివి చేసేవాళ్లను ఉపేక్షించవద్దన్నారు. స్టేషను పరిధిలోని నేరాలు, దర్యాప్తు వంటి అంశాలను సీఐ బాజీలాల్ వివరించారు. సెంట్రల్ జోన్ డీఎస్పీ కె.రమేశ్‌బాబు పాల్గొన్నారు.

బర్డ్‌ఫ్లూపై వదంతులు, అపోహలు నమ్మొద్దు!



- చికెన్, గుడ్లు వినియోగంపై జాగ్రత్తలు తీసుకోవాలి
- జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రబలిన బర్డ్‌ఫ్లూ (ఏవియన్ ఇన్‌ఫ్లుయెంజా)పై సోషల్ మీడియా, ఇతర ప్రసార మాధ్యమాల్లో వస్తున్న వదంతులు, అపోహలు నమ్మొద్దని, ఏ ఒక్కరూ భయపడాల్సిన పనిలేదని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరావు పేర్కొన్నారు. దీని నియంత్రణపై ప్రజలందరికీ అవగాహన కల్పించామని వెల్లడించారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ బర్డ్‌ఫ్లూ పక్షులకు మాత్రమే వస్తుందని, ప్రజలు తగిన జాగ్రత్తలు పాటిస్తే వైరస్ సోకదని స్పష్టంచేశారు. బర్డ్‌ఫ్లూ సోకిన ప్రాంతాల ప్రజలు ఆరోగ్యంగా ఉండటానికి మాత్రమే కాకుండా వైరస్‌వ్యాప్తిని అడ్డుకోవడానికి పలు జాగ్రత్తలు అవసరమని తెలిపారు. ఏదైనా జ్వరం, జలుబు, తలపోటు, ఒళ్లు నొప్పులు, కండరాల నొప్పులు వంటి లక్షణాలు వచ్చిన వెంటనే వైద్య సిబ్బందికి తెలియజేయాలని సూచించారు. పెరవలి, ఉండ్రాజవరం, నల్లజర్ల, చాగల్లు, నిడదవోలు, సీతానగరం మండలాల్లో మొత్తం 64 టీమ్స్ ద్వారా 22,902 ఇళ్లను సందర్శించి అందులో 87,724 ప్రజలకు రోగ లక్షణాలపై సర్వే చేశామని, ఎవరికీ ఎలాంటి లక్షణాలు లేవని ఆయన తెలిపారు. బర్డ్‌ఫ్లూ వెలుగుచూసిన ప్రాంతాల్లో వైద్య, ఆరోగ్యశాఖ డోర్ టు డోర్ నిఘా పెట్టిందని, పది కిలోమీటర్ల పరిధిలోని పీహెచ్‌సీలను తమ వైద్య బృందాలు కవర్ చేశాయని తెలిపారు. రోగ లక్షణాలున్న కేసులను గుర్తించడానికి, ఇంటింటి నిఘా కోసం ఆశాలు, ఏఎన్ఎంలు, సీహెచ్‌వోలతో కూడిన 64 వైద్య బృందాలను నియమించడం జరిగిందని తెలిపారు. ఏదైనా సమాచారం కోసం ఆరోగ్య సిబ్బందిని కానీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని కానీ సంప్రదించాలని ఆయన కోరారు.

ఈ జాగ్రత్తలు తీసుకోవాలి..

కోడిగుడ్లు, చికెన్ వినియోగానికి ముందు శుభ్రం చేయడంతోపాటు వంటకు తగిన జాగ్రతలు తీసుకోవాలని డాక్టర్ వెంకటేశ్వరరావు సూచించారు. ముడి మాంసం, హాఫ్ బాయిల్డ్ చేసిన గుడ్లు తినకూడదని తెలిపారు. కోడిగుడ్లు చికెన్ చేతితో తాకినా ఆ తర్వాత బాగా చేతులు కడుక్కోవాలని, చికెన్, గుడ్లను వేర్వేరుగా నిల్వ చేయాలని, ఇతర ఆహార పదార్థాలతో కలపకూడదని పేర్కొన్నారు. కోళ్లు మరణించి ఉంటే వాటిని తగిన జాగ్రత్తలతో నిర్మూలన చేయాలని ఆయన వెల్లడించారు.

గుడి వద్ద సీఐడీ డీఎస్పీ మృతదేహం మెయిన్ 3లో

ఏ దివిలో మెరిసిన పారిజాతమో...
ఏ కవిలో మెరిసిన ప్రేమ గీతమో...
నా మదిలో నీవై నిండిపోయెనే...

హృదయం ఎక్కడున్నది... హృదయం ఎక్కడున్నది...
నీ చుట్టూనే తిరుగుతున్నది...

మనసున ఉన్నది... చెప్పాలనున్నది... మాటలు రావేలా...

ఇది చెరగని ప్రేమకు శ్రీకారం...
ఇది మమతల మేడకు ప్రాకారం...

...ఇలా రచయితలెందరో ప్రేమ గురించి వర్ణించారు.

ప్రేమ అంటే... ఏదో తెలియని ఫీలింగ్.. రెండక్షరాల ఈ మాట రెండు హృదయాలను ఒక్కటి చేస్తుంది.... ఎక్కడ ఉన్నా పక్కన నువ్వే ఉన్నట్టుంటుందీ... అదేం గారడీ అనుకునే ప్రేమ జీవులు ఎదురుచూసే రోజే వాలెంటైన్స్‌డే.

ప్రేమంటే.. రెండు గుండెలు, మూడు ముళ్లు, ఏడు అడుగులు మాత్రమే కాదు. జీవితాంతం ఒకరినొకరు గౌరవించుకుంటూ సాగిపోవడమే అసలైన ప్రేమ.

ప్రేమంటే అనురాగ బంధం... అనురాగ మంత్రం... అనిర్వచనీయ అనుభూతి... మరపురాని, మరువలేని భావోద్వేగం.... ఇలా ప్రేమకు ఒక్కొక్కరు ఒక్కో నిర్వచనం చెప్తారు.

తొలి చూపులోనే ప్రేమలో పడి పెద్దలను ఒప్పించి పెళ్లి పీటలు ఎక్కిన వారు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఎందరో ఉన్నారు.

ప్రేమికుల దినోత్సవం సందర్భంగా అందులో కొందరి 'ప్రేమ' ఊసులు...

ఏదో... ఫీలింగ్




సుభాష్-లక్ష్మీసునీత

సీతారాముల కల్యాణంలో ప్రేమకు శ్రీకారం
పెద్దల అంగీకారంతో పరిణయం

ద్రాక్షారామ (ఆంధ్రజ్యోతి)

2007లో శ్రీరామనవమి నాడు సీతారాముల కల్యాణం జరుగుతుండగా ఆలయంలో లక్ష్మీసునీతను చూశాను. తొలిచూపులోనే ఇష్టపడ్డాను. ఆమె గురించి వాకబు చేశాను. నాయనమ్మకు చూపించారు. రెండుసార్లు నా ప్రేమ గురించి చెప్పాను. మౌనమే ఆమె సమాధానం. చివరకు పెద్దల ఇష్టమని చెప్పింది.

నా ప్రేమ విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పాను. మా తాతగారు అంగీకరించలేదు. లక్ష్మీ సునీతనే వివాహం చేసుకుంటానని పట్టుబట్టాను. మా నాన్నగారు పెద్ద మనసుతో అర్థం చేసుకుని సునీత తల్లిదండ్రులతో మాట్లాడారు. రెండు కుటుంబీకుల అంగీకారంతో ఇద్దరం ఒక్కటయ్యాము.

సునీత జన్మదినం ఏప్రిల్ 19. మా వివాహం 2009 ఏప్రిల్ 19న అమలాపురంలో అంగరంగ వైభవంగా జరిగింది. మా ప్రేమకు ప్రతిరూపంగా 2018 జూలై 11న సత్యదివిత, సత్యదీక్షిత (కవలలు) జన్మించారు.

వాసంశెట్టి సుభాష్
కార్మిక శాఖ మంత్రి

హాకీ కలిపింది ఇద్దరినీ...


రవిరాజా-నాగమణి

వి.రవిరాజా, ఫిజికల్ డైరెక్టర్

1995లో క్రీడల పట్ల మక్కువతో హాకీ ఆడేందుకు జిల్లా క్రీడా మైదానానికి వెళ్లేవాడిని. ఆ సమయంలోనే హాకీ క్రీడాకారిణిగా వచ్చిన నాగమణిని చూసి ప్రేమలో పడ్డాను. అభిప్రాయాలు దగ్గరగా ఉండడంతో ఇష్టపడ్డాం. ఈ క్రమంలో 1999లో ట్రైనింగ్‌కి వెళ్లి 2002లో పీఈటీలుగా ఉద్యోగాలు సంపాదించాం. ఇద్దరం ఒక అభిప్రాయానికి వచ్చిన తర్వాత తల్లిదండ్రులతో మాట్లాడి 2003లో వివాహం చేసుకున్నాం. ఇద్దరమ్మాయిలు పుట్టారు. పెద్దమ్మాయి ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్, రెండో అమ్మాయి అగ్రికల్చర్ బీఎస్సీ ఫస్ట్ ఇయర్ చదువుతున్నారు. ఫిజికల్ డైరెక్టర్లుగా ఇద్దరం ఒకేసారి ఉద్యోగోన్నతి పొందాం. ఇప్పటికీ ఒకరి అభిప్రాయాన్ని మరొకరు గౌరవించుకుంటూ ప్రేమను వ్యక్తపరుచుకుంటాం.

కార్పొరేషన్ (కాకినాడ) (ఆంధ్రజ్యోతి)

ప్రైవేటులో ప్రేమ


గెడ్డం ఫిలిప్‌రాజు-లక్ష్మీజ్యోతి

తను మెట్రిక్యులేషన్‌కు, నేను డిగ్రీకి లెక్చరర్ కె.వెంకటేశ్వర్లు వద్ద ఇంగ్లిష్ ప్రైవేటుకు వెళ్లేవాళ్లం... అప్పుడే మనసులు కలిశాయి. ఇద్దరి మధ్య ప్రేమ చిగురించింది. 1993లో పెద్దల అంగీకారంతో పెళ్లి చేసుకున్నాము. ఆనాటి అన్యోన్యమే నేటికీ కొనసాగుతోంది.

గెడ్డం ఫిలిప్‌రాజు

మలికిపురం (ఆంధ్రజ్యోతి)



ప్రేమికుల రోజున తమ ప్రేయసికి... లేకుంటే ప్రియునికి... మనసులోని భావాలను మధురమైన రూపంలో చెప్పాలని... అందమైన ప్రతిమలుగా అందించాలని తహతహలాడే ప్రేమికుల కోసం దుకాణాల్లో కళ్లు చెదిరే ప్రేమ కానుకలు కొలువుదీరాయి. ప్రేమ చిహ్నమైన హృదయాకారంలో వివిధ ఆకృతుల్లో మదిని దోచేస్తున్నాయి. సుదూర ప్రాంతంలో ఉన్న ప్రేమికులు ఒకరికొకరు అభినందనలు తెలుపుకునేందుకు ఆన్‌లైన్‌లో బహుమతులు పంపుకుంటున్నారు. ఒకే ప్రాంతంలో ఉన్న ప్రియుడు, ప్రియురాలు ఒకరినొకరు సర్‌ప్రైజ్ చేసేందుకు ఈ మార్గాన్ని ఎంచుకుంటున్నారు.


కాకినాడ భానుగుడి సెంటర్లోని విక్రయ దుకాణాల్లో బొకేలు, గిఫ్ట్‌లు



అసలు ప్రేమికుల రోజును ప్రపంచమంతా జరుపుకుంటారా? అంటే లేదనే సమాధానం వినిపిస్తోంది. ప్రతిఏటా ఫిబ్రవరి 14న అమెరికా, కెనడా, మెక్సికో, లండన్, ఆస్ట్రేలియా, భారత్, ఇటలీ, డెన్మార్క్, జపాన్‌ల్లో మాత్రమే జరుపుకుంటున్నారు. మూడో శతాబ్దంలో రోమ్ రాజ్యాన్ని క్లాడియస్ అనే చక్రవర్తి పాలిస్తుండేవాడు. సెయింట్ వాలెంటైన్ ఆ రాజ్యంలో ఓ ప్రవక్త. పురుషులు పెళ్లి చేసుకుంటే సైన్యంలో చేరడం తగ్గిపోతుందనే ఉద్దేశంతో పెళ్లిళ్లను క్లాడియస్ రద్దు చేశాడు. అయితే ప్రేమ, పెళ్లి దేవుడికి వ్యతిరేకం కాదని బోధిస్తూ రహస్యంగా ప్రేమికులకు వాలెంటైన్ పెళ్లిళ్లు చేస్తుండేవాడు. ఇది రాజుకు తెలిసి అతడికి మరణశిక్ష విధించాడు. ఫిబ్రవరి 14న దానిని అమలు చేశారు. తన కూతురిని ప్రేమించిన వాలెంటైన్‌ని రాజు ఉరి తీయించాడనే మరో కథనం కూడా ఉంది.

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

కన్నుల్లో నీ రూపమే గుండెల్లో నీ ధ్యానమే


శ్రీనివాస్-కమలకుమారి

మొదటి ప్రేమ అంటే ఇలాగే ఉంటుందని ఆమెను చూసిన తర్వాతే తెలిసింది. 1996లో ఇంటర్మీడియట్ చదువుకునే రోజుల్లో ఒక అమ్మాయిని చూశాను. తొలి చూపులోనే ఆమెతో (కమలాకుమారి) ప్రేమలో పడ్డాను. ఎవరిని చూసినా ఆమె రూపమే కనిపించేది. ఇరువైపులా తల్లిదండ్రుల సహకారంతో 2005 డిసెంబరు 15న వివాహ బంధంతో ఇద్దరం ఒక్కటయ్యాం. ఇద్దరు అమ్మాయిలు జన్మించారు. పెళ్లి సమయానికి జాబ్ లేదు. ఇంతలో రోడ్డు ట్రాన్స్‌పోర్టు (ఆర్టీవో) డిపార్టుమెంట్‌లో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఏఎంవీఐ) పోస్టులకు నోటిఫికేషన్ విడుదలైంది. నా భార్య ఇచ్చిన సపోర్టుతో ఉద్యోగం సంపాదించాను. మా ప్రేమ మొదలై సుమారు 25 సంవత్సరాలైంది. అప్పటికీ, ఇప్పటికీ ఆమెపై నా ప్రేమ అలాగే ఉంది.

బి.శ్రీనివాస్,
మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్

కార్పొరేషన్ (కాకినాడ) (ఆంధ్రజ్యోతి)

కనులవిందు.. నరసన్న తెప్పోత్సవం

- హంస వాహనంపై విహరించిన నృసింహుడు
- స్వామికి ఘనంగా శ్రీపుష్పోత్సవం
- పవళింపు సేవ.. ముగిసిన తీర్థ మహోత్సవాలు


పుష్పక వాహనంపై విహరిస్తున్న శ్రీలక్ష్మీనరసింహుడు

అంతర్వేది, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా చివరి రోజు గురువారం స్వామివారికి పుష్పక వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం అప్పనపల్లి వాసి దంతుకుర్తి శివసుబ్రహ్మణ్యేశ్వరరావు నిర్మించిన పుష్పక వాహనంపై స్వామిని మేళతాళాలు, బాణసంచా కాల్పులతో పురవీధుల్లో ఊరేగించి ఆలయ ఉత్తర ఈశాన్యంలో ఏర్పాటుచేసిన చెరువు వద్దకు తీసుకొచ్చారు. తొలుత అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చెరువులో ప్రత్యేకంగా అలంకరించిన హంస వాహనంపై తెప్పోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గోవింద నృసింహ నామాలతో జేజేలు పలికారు. బాణసంచా కాల్పులతో కనుల పండువగా జరిగింది. టశాస్త్రి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే దేవవరప్రసాద్, దాత గొట్టిముక్కల భీమరాజు, ఆలయ చైర్మన్, ఫ్యామిలీ ఫౌండర్ కలిదిండి కుమార రామగోపాల రాజాబహద్దూర్, ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, ఉత్సవ కమిటీ చైర్మన్ దిరిశాల బాలాజీ, ఆర్డీవోలు కె. ఆలయ ప్రధానార్చకులు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్, పెద్దింటి వెంకటశ్రీనివాస్, స్థానాచార్యులు వింజమూరి రంగాచార్యులు, వేద పండితులు చింతా వెంక మాధవి, అఖిల, డీఎస్పీ మురళీమోహన్, సీఐ నరేష్‌కుమార్, ఎస్ఐ కె.దుర్గాశ్రీనివాస్, ముప్పర్తి నాని, గుబ్బల ఫణికుమార్, ఆకన బాబ్జినాయుడు, బైరా నాగరాజు, కడలి వెంకటరత్నం పాల్గొన్నారు. రాత్రి స్వామివారికి తిరుమంజనాలు, దర్పణ సేవ, ధూపసేవ, విశ్వక్సేనారాధన నిర్వహించారు. రాత్రి 9 గంటలకు ఆలయంలో నరసన్నకు ఘనంగా శ్రీపుష్పోత్సవం నిర్వహించారు. చెంగోల విన్నపం అనంతరం స్వామి పవళింపు సేవతో తీర్థ మహోత్సవాలు ముగిశాయి.

పుష్కరిణి సంప్రోక్షణ

నరసింహస్వామి కల్యాణోత్సవాల ముగింపు సందర్భంగా తెప్పోత్సవం నిర్వహించేందుకు ఆలయ ఉత్తర ఈశాన్య భాగంలో నూతన పుష్కరిణి ఏర్పాటు చేశారు. తొలుత త్రివేణి సంగమం నుంచి తీసుకువచ్చిన ప్రయాగ్‌రాజ్ జలాలతో నూతన చెరువుకు సంప్రోక్షణ పూజా కార్యక్రమాలను అర్చకులు నిర్వహించారు. అనంతరం తెప్పోత్సవ ఏర్పాట్లను ఆర్డీవో కె.మాధవి, డీఎస్పీ మురళీమోహన్, ఆలయ ఏసీ వి.సత్యనారాయణ గురువారం తెప్పోత్సవానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నూతన పుష్కరిణి వద్ద ఎటువంటి తొక్కిసలాట జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు.

మనోహరం.. భీమేశ్వరుని జలవిహారం

ద్రాక్షారామ, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి స్వామివారి తెప్పోత్సవం సప్తగోదావరి నదిలో నయన మనోహరంగా జరిగింది. రాత్రి కల్యాణమూర్తులు మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామిని మంగళ వాయిద్యాల మధ్య సప్త గోదావరిలో విద్యుద్దీపాలు, పుష్పాలంకృతమైన హంసవాహనంపై ఆశీనులను చేశారు. వేద పండితుడు బులుసు రామకృష్ణ బృందం చేసిన ఆస్థాన పూజ అనంతరం స్వామివారు జలవిహారం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి తన్మయత్వంతో తిలకించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో, సహాయ కమిషనర్ అల్లు వెంకటదుర్గాభవానీ ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.


హంసవాహనంపై విహరిస్తున్న భీమేశ్వరుడు

17, 19 తేదీల్లో కుంభమేళాకు ప్రత్యేక బస్సులు

కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): కాకినాడ డిపో నుంచి ఈనెల 17, 19 తేదీల్లో ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగరాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాకు సూపర్ లగ్జరీ స్పెషల్ బస్సులు నడిపేందుకు ఏర్పాటు చేసినట్టు జిల్లా ప్రజా రవాణాధికారి శ్రీనివాసరావు తెలిపారు. ఈ బస్సుకు టికెట్స్ కావాల్సిన భక్తులు ముందుగా అడ్వాన్స్ రిజర్వేషన్ చేయించుకోవచ్చన్నారు. ఈ బస్సులు ఆర్టీసీ డిపో నుంచి బయలుదేరి భువనేశ్వర్, పూరి, కోణార్క్ మీదుగా ప్రయాగ్‌రాజ్ చేరుకుని త్రివేణి సంగమంలో పవిత్ర స్నానాలు పూర్తయ్యాక తిరుగు ప్రయాణంలో అయోధ్య, వారణాసి క్షేత్రాలు చూపించి ఏడు రోజుల అనంతరం కాకినాడ చేరుతుందన్నారు. ఈ బస్సుకు టిఫిన్స్, భోజనాలతో సహా ఒకో టిక్కెట్‌కు 10వేలుగా నిర్ణయించారన్నారు. టికెట్స్ బుకింగ్ కోసం 73829 10869, 73829 10778 నెంబర్లను సంప్రదించలన్నారు.

16 నుంచి అచ్యుతాపురం రైల్వేగేటు మూసివేత

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): కాకినాడ నగరం పరిధిలో ఉన్న అచ్యుతాపురం రైల్వేగేటును ఈనెల 16వతేదీ నుంచి మూసివేస్తున్నట్లు కాకినాడ రైల్వే సెక్షన్ ఇంజనీరు రమేష్, అసిస్టెంట్ ఇంజనీరు శాస్త్రి తెలిపారు. ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. మరమ్మతుల నిమిత్తం 16వ తేదీ నుంచి 26వ తేదీ వరకు పదిరోజులపాటు మూసివేస్తున్నట్లు పేర్కొన్నారు. అచ్యుతాపురం పరిసర ప్రాంతాల వాసులు ప్రత్యామ్నాయ మార్గాలద్వారా పయణించి రైల్వేఅధికారులకు సహకరించాలని విజ్ఞప్తిచేశారు. మరమ్మతులు పూర్తి అయ్యిన తర్వాత వాహనాల రాకపోకల యధావిధిగా సాగుతాయన్నారు.

తగ్గుతున్న గోదావరి నీటి మట్టం

ధవళేశ్వరం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): రబీ అవసరాల కోసం కాటన్ బ్యారేజ్ నుంచిడెల్టా కాలువలకు 8850క్యూసెక్కుల విడుదల చేస్తుండగా గోదావరి నీటి లభ్యత 8618క్యూసెక్కులుగా ఉంది. గోదావరిలో నీటి లభ్యత తగ్గుతూ ఉండటంతో పాండ్‌లో నిల్వ ఉన్న నీటిని విడుదల చేస్తున్నారు. దీని వల్ల గోదావరి నీటి మట్టం నాలుగు రోజులుగా క్రమంగా తగ్గుముఖం పడుతోంది. సోమవారం 9.95 అడుగులుగా ఉన్న నీటి మట్టం గురువారం నాటికి 9.45 అడుగులకు చేరుకుంది. సీలేరు నుంచి పవర్ జనరేషన్ ద్వారా 4వేల క్యూసెక్కులు గోదావరికి విడుదలవుతుండగా బైపాస్ మార్గం ద్వారా మరో 3వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. దీంతో పోలవరం వద్ద నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. పోలవరం నుంచి నీరు దిగువకు ప్రవహించడంతో ఉన్న అడ్డంగుల వల్ల ధవళేశ్వరం వద్దకు చేరడం ఆలస్యమవుతోంది. దీంతో పాండ్‌లో ఉన్న నీటిని గోదావరికి విడుదల చేస్తూ ఉండడంతో నీటి మట్టం తగ్గుముఖం పడుతోంది. కాగా గురువారం తూర్పు డెల్టాకు 2600 క్యూసెక్కులు, మధ్యడెల్టాకు 1800 క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 4400 క్యూసెక్కులు చొప్పున విడుదల చేస్తున్నారు.

ఆగమ శాస్త్రానికి విరుద్ధంగా నిర్మించిన
భవనాల గుర్తింపు



సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) చోళుల కాలంలో సర్పవరంలో వెలసిన శ్రీరాజ్యలక్ష్మీ సమేత భావనారాయణస్వామి ఆలయ సమీపంలో ఆగమ శాస్త్రం నిబంధనలకు విరుద్ధంగా బహుళ అంతస్తుల భవనాల నిర్మాణం జరుగుతోంది. ఆలయ నిర్మాణం, పూజలు, ఆచారాలు వంటి వాటికి సంబంధించిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఆలయం గోపురం, ధ్వజస్తంభం, ప్రహరీ నుంచి సుమారు 200 మీటర్ల మేర గాలి గోపురం కంటే ఎత్తులో ఎటువంటి భవన నిర్మాణాలు చేపట్టరాదనే నిబంధనలున్నాయి. అయితే భావనారాయణ స్వామి తూర్పు దిక్కులో నిబంధనలకు విరుద్ధంగా బహుళ అంతస్తుల భవన నిర్మాణాలు, రోడ్డు వెలుపలకు వచ్చి జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం పట్ల భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భక్తుల మనోభావాలకు విరుద్ధంగా జరుగుతున్న అక్రమ భవన నిర్మాణాలను అడ్డుకోవాలని పురావస్తు శాఖ ఉన్నతాధికారులకు స్థానికులు ఫిర్యాదు చేశారు.

సర్పవరంలో పర్యటించిన పురావస్తుశాఖాధికారులు

ఈ మేరకు గురువారం కాకినాడ జిల్లా పురావస్తుశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ తిమ్మరాజు దేవాదాయ,ధర్మాదాయ శాఖ సిబ్బందితో కలసి సర్పవరం పర్యటించారు. ఈ సందర్భంగా భావనారాయణస్వామి ఆలయం పరిసర ప్రాంతాల్లో జరుగుతోన్న బహుళ అంతస్తుల భవనాలు, రోడ్డు వెలుపలకు వచ్చి నిర్మించిన పలు కట్టడాలను గుర్తించారు. ఆగమ శాస్త్రం ప్రకారం ఆలయ ప్రాకారానికి ఎత్తులో ఎటువంటి నిర్మాణాలు చేపట్టరాదన్నారు. ఇటువంటి భవన నిర్మాణాలకు పంచాయతీ అధికారులు అనుమతులు ఇవ్వరాదన్నారు. ఆగమ శాస్త్రానికి విరుద్ధంగా నిర్మించిన భవన యాజమానులను గుర్తించి, వారికి నోటీసులు జారీ చేస్తామన్నారు.

జబర్దస్త్ నటుల సందడి



కొత్తపేట, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం వాడపాలెంలో శ్రీసత్తెమ్మ తల్లి జాతర సందర్భంగా గురువారం రాత్రి జబర్దస్త్ నటులు సందడి చేశారు. ఈ సందర్భంగా నటుల రాకతో వారి చేసే కామెడీ ప్రదర్శనను పెద్దఎత్తున తిలకించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పాల్గొని వారికి అభినందనలు తెలిపారు.

ముగిసిన నరసింహస్వామి అధ్యయనోత్సవాలు



కోరుకొండ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ లక్ష్మీనరసింహ స్వామి అధ్యయన మహోత్సవాలు గురువారం ముగిశాయి. భీష్మ ఏకాదశి రోజున చేపట్టిన ఈ అధ్యయనోత్సవాలు 5రోజుల పాటు నరసన్న కొండపైన అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా గురువారం కొండపైన బేడా ఉత్సవం, శ్రీ నన్నార్వాళ్ల పరమ పద ఉత్సవం నిర్వహించారు. అనంతరం 5రోజులు కొండపై ఉండి పూజలందుకున్న లక్ష్మీనరసింహస్వామి ఉత్సవమూర్తులను వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య దిగువ దేవస్థానానికి తీసుకువచ్చారు.

శేష వాహనంపై గ్రామోత్సవం

శ్రీ భూ సమేత అనంత పద్మనాభస్వామి గ్రామోత్సవం శేషవాహనంపై కన్నుల పండువగా జరిగింది. నరసింహస్వామి అధ్యయనోత్సవాలు ముగిసిన సందర్భంగా గురువారం రంగనాథస్వామి ఆలయంలో రెండు రోజులపాటు జరిగే అధ్యయనోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం సేవాకాలం, రాత్రి బేడా ఉత్సవం జరిగాయి.

పూట గడవడానికి...
నాటు తెప్ప..!




కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం సుబ్బంపేట తీరంలో నాటు తెప్పపై వేటకు వెళుతున్న మత్స్యకారుడు

కొత్తపల్లి(ఆంధ్రజ్యోతి): తీరప్రాంతాలకు చెందిన మత్స్యకార కుటుంబాల్లో కొందరికి నాటు తెప్పే జీవనాధారం. అయితే లక్షల వ్యయంతో బోట్లు తయారు చేయించుకుని కోట్లు సంపాదించుకున్న మత్స్యకారులు ఉన్నారు. అదే మత్స్యకార కుటుంబాల్లో ఏ పూటకో పూట వేటకు వెళితే కానీ ఇల్లు గడవని పరిస్థితి. ఇదే తరహాలో ఇంకా నేటికీ ఉప్పాడ తీరప్రాంత గ్రామాల్లో అనేక కుటుంబాలు ఉన్నాయి. వారిలో చాలా మంది కర్ర తెప్పలు, కొందరు నాటు తెప్పలు(థర్మోకోల్ అట్టలు) తయారు చేసుకుని వేటకు వెళ్లి జీవనోపాధి పొందుతున్నారు. ఇలా కర్ర, నాటు తెప్పలతో మత్స్యకారులు సముద్రం ఒడ్డు నుంచి సుమారు 100 నుంచి 200 మీటర్ల మేర వేట చేస్తారు. అదృష్టం బాగుంటే ఆ రోజు కూలి పనుల డబ్బులు గిట్టుబాటు అవుతాయి. లేకుంటే ఆ రోజుకు కష్టం వృథాగా పోతుంది. పేద, బడుగు మత్స్యకారులకు ఫైబర్ తెప్పలను ప్రభుత్వం మంజూరు చేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

బరిలో 35 మంది

- ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ
- మొత్తం 54మంది నామినేషన్లు దాఖలు
- స్క్రూట్నీలో 11 నామినేషన్ల తిరస్కరణ
- పోటీ నుంచి 8మంది విరమణ

ఏలూరు/రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు నామినేషన్ల ఉపసంహరణ ఘట్టం ముగిసింది. బరిలో 35 మంది పోటీ పడుతున్నారు. మొత్తం 54మంది నామినేషన్లు దాఖలు చేయగా 11మందిని స్క్రూట్నీలో తిరస్కరించారు. మరో 8మంది తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో ఈనెల 27న జరగనున్న పోలింగ్‌లో 35మంది బరిలో నిలిచారు. ఇందులో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థిగా పేరాబత్తుల రాజశేఖర్, పీడీఎఫ్ అభ్యర్థిగా డీవీ రాఘవులు, స్వతంత్ర్య అభ్యర్థిగా మాజీ ఎంపీ జీవీ.హర్షకుమార్ కొడుకు జీవీ సుందర్, రాజమండ్రికి చెందిన రిటైర్డ్ సీటీవో బొమ్మనబోయిన వీఎస్ఆర్ మూర్తి వంటి వారు కూడా పోటీలో ఉన్నారు. పట్టభద్రుల నియోజకవర్గంలో మొత్తం 3,13,126ఓట్లు ఉన్నాయి. ఈ స్థానాన్ని ఎలాగైనా గెలిపించుకోవాలనే లక్ష్యంతో అధికార కూటమి వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. ఈనెల 27న ఉదయం 8 నుంచి 4 గంటల వరకు జరిగే పోలింగ్ ఏర్పాట్లపై ఏలూరు జిల్లా యంత్రాంగం సన్నద్ధం కానుంది.

రంగంలో నిలిచింది వీరే..

పేరాబత్తుల రాజశేఖరం(కూటమి అభ్యర్థి), దిడ్ల వీరరాఘవులు(పీడీఎఫ్), కాట్రు నాగబాబు, షేక్ హుస్సేన్, కట్టా వేణుగోపాలకృష్ణ, కాండ్రేగుల నరసింహం, కాళ్లూరి కృష్ణమోహన్, కుక్కల గోవిందరాజు, కునుకు హేమాకుమారి, కైలా లావణ్య, గౌతంబాబు కొల్లు, చిక్కాల దుర్గారావు, తాళ్లూరి రమేష్, దత్తాత్రేయ నోరి, దొరబాబు యాళ్ల, నీతిపూడి సత్యనారాయణ, పినిపే నాగభూషణశర్మ, పిప్పళ్ల సుప్రజ, పేపకాయల రాజేంద్ర, బొడ్డు శ్రీనివాసరావు, బొమ్మనబోయిన వీఎస్ఆర్ మూర్తి, బొమ్మిడి సన్నిరాజ్, బండారు రామ్మోహన్ రావు, భీమేశ్వరరావు చిక్కా, మాకే దేవీప్రసాద్, మెర్ల శాస్త్రులు, మోకన అంబేడ్కర్, రాజపూడి, జేటీ రామారావు, రేవులగడ్డ ముఖేష్‌బాబు, వానపల్లి శివగణేష్, ఎం.శ్రీనివాసరావు, శ్రీనివాస్ విష్ణువజ్ఝల, జీవీ సుందర్, హసన్ షరీఫ్ బరిలో నిలిచారు. ఉపసంహరించుకున్న వారి పేర్లు... గద్దె విజయలక్ష్మి, డాక్టర్ కవల నాగేశ్వరావు, పచ్చిగోళ్ల దుర్గారావు, పేరాబత్తుల సత్యవాణి, బాలాజీ గుండుమోలు, పిళ్లంగోళ్ల లీలా నగేష్, సత్తిరాజు స్వామి, చక్రపాణి.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి : వెట్రిసెల్వి

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను సజావుగా, ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అభ్యర్థులు సహకరించాలని ఏలూరు జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ కె.వెట్రిసెల్వి కోరారు. ఎన్నికల పరిశీలకురాలు కె.సునీత సమక్షంలో పోటీలో నిలిచిన అభ్యర్థులతో వెట్రిసెల్వి గురువారం సమావేశం నిర్వహించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తూచా పాటించాలని, ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు తావివ్వద్దని సూచించారు. టీవీ, ఇతర సోషల్ మీడియా ప్రచారం కోసం మీడియా సర్టిఫికేషన్ మోనటరింగ్ కమిటీ ముందస్తు అనుమతి తప్పనిసరి అన్నారు. ఈనెల 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ జరుగుతుందని వివరించారు. సందేహాలుంటే టోల్‌ఫ్రీ నెంబర్ 1950కు సంప్రదించాలని కోరారు. ఏఆర్‌వో వి.విశ్వేశ్వరరావు, ఎమ్మెల్సీ బరిలో ఉన్న అభ్యర్థులు పాల్గొన్నారు.

సత్తిరాజుస్వామి నామినేషన్ ఉపసంహరణ

టీడీపీలో చేరిక..పేరాబత్తులకు మద్దతు

అమలాపురం/ఏలూరు ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన కోనసీమ జిల్లా రాజోలుకు చెందిన సత్తిరాజు ఎస్‌వీయూఆర్ స్వామి నామినేషన్ ఉపసంహరించుకున్నారు. ఏలూరు కలెక్టరేట్‌లో గురువారం స్వామి తన నామినేషన్ విత్‌డ్రా చేసుకున్నారు. ఎమ్మెల్సీ పోటీ నుంచి వైదొలిగి కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మద్దతుగా పనిచేయాలని టీడీపీ అధిష్ఠానం కోరడంతో స్వామి ఈ నిర్ణయం తీసుకున్నారు. టీడీపీ మీడియా కో-ఆర్డినేటర్ బోళ్ల సతీష్‌బాబు, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి చెల్లుబోయిన శ్రీనివాస్, బీజేపీ నాయకులు ఉపద్రష్ట నాగార్జున వెంట ఉండి స్వామితో విత్ డ్రా చేయించారు. అలాగే సత్తిరాజుస్వామి తన మిత్రులతో కలిసి టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు సమక్షంలో టీడీపీలో చేరారు. అదేవిధంగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి కె.అచ్చెన్నాయుడును వారు మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీ కోసం పని చేయాల్సిందిగా ఆయన కోరారు.



టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు సమక్షంలో టీడీపీలో చేరిన సత్తిరాజుస్వామి

ప్లాన్ చేసి... అన్నను బురిడి కొట్టించిన తమ్ముడు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): జల్సాలకు అలవాటు పడిన ఓ తమ్ముడు(వరుసకు) అన్నకే కన్నం వేశాడు. త్రీటౌన్ సీఐ అప్పారావు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఆర్యాపురానికి చెందిన సుమన్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పనిచేస్తున్నాడు. కొద్ది రోజుల నుంచి వర్క్‌ఫ్రం హోం చేస్తూ రాజమహేంద్రవరంలో ఉంటున్నాడు. ఈనెల 7న పీ అండ్ టీ కాలనీలో నివాసం ఉంటున్న చిన్నమ్మ కొడుకు ఉయ్యూరి ప్రభు రవితేజతో కలిసి బైక్‌పై వెళుతుండగా కోరుకొండ రోడ్డు మార్కెట్ యార్డు వద్దకు వచ్చేసరికి మరో బైక్‌పై వచ్చిన ఇద్దరు యువకులు అటకాయించి కత్తితో బెదిరించి 2సెల్‌ఫోన్లు, 4 కాసుల బంగారు గొలుసు, 2 ఉంగరాలు దోచుకెళ్లారు. దీనిపై త్రీటౌన్‌లో సుమన్ ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా విస్తుపోయే విషయం బయటపడింది. విచ్చలవిడిగా తిరగడం అలవాటైన రవితేజకు సుమన్ బంగారు వస్తువులు, ఖరీదైన సెల్‌ఫోన్‌పై కన్ను పడింది. తన స్నేహితుడైన తాడితోట శాంతిపురానికి చెందిన మంతెన గోపి, అల్కాట్‌తోటకు చెందిన నీలాపు శ్యాం సుందర్ రెడ్డితో కలిసి ప్లాన్ చేశాడు. సుమన్‌ని బైక్‌పై కోరుకొండ రోడ్ వైపు తీసుకెళ్లగా ఆ ప్లాన్‌ని అమలు చేశారు. తన సెల్‌ఫోన్, ఒక ఉంగరాన్ని కూడా భయపడి గోపి, శ్యాంకి ఇచ్చేసి సుమన్‌ని పక్కదారి పట్టించే ప్రయత్నం చేశాడు. అయితే పోలీసులు తమదైన శైలిలో విచారించగా నిజం కక్కలేక తప్పలేదు. నిందితులను అరెస్టు చేసి రిమాండుకు తరలించామని సీఐ పేర్కొన్నారు.

గంజాయితో ముగ్గురి అరెస్ట్

6.200 కిలోల గంజాయి స్వాధీనం

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేటలో గురువారం 6.200 కిలోల గంజాయితో పాటూ ముగ్గురు నిందితులను సర్పవరం పోలీసులు అరెస్ట్ చేశారు. గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపే చర్యల్లో భాగంగా జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఆదేశాలతో గురువారం సర్పవరం ఎస్‌హెచ్‌వో బి.పెద్దిరాజు ఆధ్వర్యంలో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా రమణయ్యపేట ఏపీఐఐసీ దండుపుంతకు చెందిన వలస గిరిధర్, స్థానిక ఏపీఎస్పీ ఇందిరాకాలనీకి చెందిన మీశాల వివేక్ అనే యువకులతో పాటూ సీసీఎల్ (మైనర్) ముగ్గురు కలిసి రమణయ్యపేట కాలువ బండ వద్ద రవాణాకు సిద్ధంగా ఉన్న 6.200 కిలోల గంజాయిని గుర్తించి పట్టుకుని ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. ఏ పనీపాటూ లేకుండా మద్యం, సిగరెట్లు, గంజాయి వంటి మత్తుపదార్థాలకు బానిసలుగా మారి డబ్బుల కోసం అల్లూరి సీతారామరాజు జిల్లా ధారకొండ నుంచి గంజాయి తీసుకువచ్చినట్లు సీఐ పెద్దిరాజు తెలిపారు. కాకినాడ పరిసర ప్రాంతాల్లో విక్రయించేందుకు గంజాయిని రవాణా చేస్తూండగా పట్టుకున్నామన్నారు. నిందితులపై ఎన్‌డీపీఎస్ చట్టప్రకారం ఎస్ఐ శ్రీనివాసకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.



గంజాయి, పట్టుబడ్డ ముగ్గురు నిందితులతో సర్పవరం పోలీసులు

మోటార్‌సైకిల్ అదుపు తప్పి...
బాలుడి మృతి

మరో బాలుడికి తీవ్రగాయాలు

పెద్దాపురంలో ఘటన



క్షతగాత్రులను ఆసుపత్రికి తరలిస్తున్న ఎస్ఐ



చికిత్స పొందుతున్న సత్యదుర్గాగణేష్



మృతిచెందిన నాగూర్(ఫైల్‌ఫొటో)

పెద్దాపురం/సామర్లకోట, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురంలో మహారాణి కళాశాల సమీపంలో అతివేగంతో మైనర్లు నడుపుతున్న మోటార్‌సైకిల్ నుంచి అదుపు తప్పి రోడ్డుపై పడిపోవడంతో ఇద్దరు బాలురకు తీవ్ర గాయాలయ్యాయి. వారిలో డేగల నాగూర్(15) అనే బాలుడు చికిత్స పొందుతూ కాకినాడ ఆసుపత్రిలో మృతిచెందాడు. మరో బాలుడు పెనుగొండ సత్య దుర్గాగణేష్(14) తీవ్ర గాయాలతో కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పెద్దాపురానికి చెందిన వారిద్దరూ గురువారం సాయంత్రం పెద్దాపురం నుంచి సామర్లకోట వైపునకు మోటార్ సైకిల్‌పై అతి వేగంగా వస్తూ ఎదురుగా యూటర్న్ చేస్తున్న మోటార్ సైకిల్‌ను తప్పించే ప్రయత్నంలో ఒక్కసారిగా బ్రేకులు వేయడంతో యాక్సిస్ మోటార్‌సైకిల్ ఎదురుగా వస్తున్న మోటార్‌సైకిల్‌ను ఢీకొని అదుపుతప్పి ప్రమాదానికి గురయ్యింది. సమాచారం తెలిసిన వెంటనే పెద్దాపురం ఎస్ఐ మౌనిక తన సిబ్బందితో సంఘటనా స్థలికి చేరుకుని పోలీసు వాహనంలోనే బాలురను కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నాగూర్ మృతిచెందాడు. తీవ్రగాయాలతో సత్య దుర్గా గణేష్‌తోపాటు మరొక వ్యక్తి కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పెద్దాపురం పోలీసులు కేసు నమోదు చేశారు.

సత్యదేవుడికి జన్మనక్షత్ర పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామి,అమ్మవార్లు

అన్నవరం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడి జన్మనక్షత్రం మఖ సందర్భంగా గురువారం జన్మ నక్షత్ర పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. వేకువజామున రెండుగంటలకు స్వామి, అమ్మవార్ల మూలవరులను సుప్రభాతసేవతో మేల్కొలిపి అభ్యంగన స్నానమాచరింపచేశారు. మహన్యాస పూర్వక రుద్రాభిషేకం అనంతరం పంచామృతాలతో అభిషేకించి నూతన పట్టువస్త్రాలను ధరింప చేశారు. ప్రత్యేకపూజలు సందర్భంగా ఉదయం 6.30కు సర్వదర్శనాలకు అనుమతించారు యాగశాలలో ఆయుష్యహోమం నిర్వహించారు. మఖనక్షత్ర పూజలకు 17 జంటలు టిక్కెట్లు కొనుగోలుచేసి వీటిలో పాల్గొన్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

కోనసీమ ప్రభల ఉత్సవాన్ని రాష్ట్ర పండుగగా ప్రకటించాలి

- సీఎం చంద్రబాబును కోరిన కల్చరల్ చైర్‌పర్సన్ తేజస్వి



అమరావతిలో సీఎం చంద్రబాబుకు కోనసీమ ప్రభల ఉత్సవంపై లేఖను అందిస్తున్న కల్చరల్ చైర్‌పర్సన్ తేజస్వి

అంబాజీపేట, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా ఖ్యాతిచెందిన కోనసీమ ప్రభల ఉత్సవాన్ని రాష్ట్ర పండుగగా ప్రకటించాలని సీఎం చంద్రబాబును రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి కమిషన్ చైర్‌పర్సన్ పొదపాటి తేజస్వి కోరారు. ఈ మేరకు అమరావతిలో చంద్రబాబుకు జగ్గన్నతోట ప్రభల తీర్థ విశిష్టతను వివరిస్తూ లేఖను అందించారు. 450 ఏళ్ళకు పైగా చరిత్ర కలిగిన జగ్గన్నతోట ప్రభల ఉత్సవాన్ని ప్రతి ఏటా కనుమ రోజున డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం మొసలపల్లి పరిధిలోని జగ్గన్నతోట లో నిర్వహిస్తారన్నారు. ఈ తీర్థానికి దేశవిదేశాలలో ఉన్న సుమారు 4 లక్షలకు మందికిపైగా భక్తులను ఆకర్షిస్తూ, కోనసీమ ప్రాంతపు సంప్రదాయాలకు, ప్రజా సంస్కృతికి ప్రతిబింభంగా నిలుస్తోందన్నారు. ఈఉత్సవాన్ని ప్రధాని నరేంద్రమోదీ, భారత ప్రభుత్వ సంస్కృతి మంత్రిత్వ శాఖ ప్రశంసించాయన్నారు. ఈ ప్రతిపాదనను ఇప్పటికే పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేశ్‌కు సమర్పించినట్లు తేజస్వి తెలిపారు. ఈ విషయంపై సానుకూలంగా స్వీకరించారన్నారు. కోనసీమ ప్రభల తీర్థాన్ని రాష్ట్ర పండుగగా గుర్తింపు ఇవ్వడంవల్ల తెలుగు సంస్కృతి పునరుద్ధరించడమే కాకుండా స్థానికంగా ఘనంగా జరుపుకునే సంప్రదాయాలకు మరింత గౌరవం చేకూరుతుందని తేజస్వి పేర్కొన్నారు. ఈ ప్రతిపాదనను సీఎం సానుకూలంగా పరిశీలిస్తానని హామీ ఇచ్చినట్లు తేజస్వి తెలిపారు.

శానిటరీ నిర్వహణపై చేతులెత్తేసిన కాంట్రాక్ట్ సంస్థ

చేయలేమని అన్నవరం దేవస్థానానికి లేఖ

అన్నవరం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో శానిటరీ నిర్వహణను దక్కించుకున్న కె.ఎల్.టి.ఎస్ సంస్థ తమ గడువు పూర్తయిందని నిర్వహణ చేయలేమని దేవస్థానానికి లేఖ రాయడం చర్చనీయాంశమైంది. ప్రస్తుతం పారిశుద్య కార్మికులు, నిర్వహణ మెటీరియల్‌కు దేవస్థానం కెఎల్‌టీఎస్ సంస్థకు ప్రతినెలా ప్రస్తుతం రూ.52.70 లక్షలు చెల్లిస్తుండగా వైసీపీ ప్రభుత్వ హయాంలో టెండరు దక్కించుకున్న ఈ సంస్థ కాలపరిమితి గతేడాది నవంబరుతో ముగిసింది. నూతన టెండర్లుకు దేవాదాయ కమిషనర్ నుంచి ఎటువంటి అనుమతులు లేకపోవడంతో అదే సంస్థతో ఇప్పటివరకు కొనసాగించారు. తాజాగా లేఖ అందజేయడంతో ఏమిచేయాలా అనేదానిపై అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. దేవదాయ కమిషనర్ ఆదేశాలు వచ్చే వరకూ దేవస్థానమే నిర్వహించాలా లేకుంటే స్థానికంగా ఉన్న మరో సంస్థకు అప్పగించాలి అనే ఆలోచనలో ఉన్నట్లు శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు. దేవదాయ కమిషనర్ ఆదేశానుసారం వ్యవహరిస్తామని అన్నారు.

అన్నవరం దేవస్థానం కాంట్రాక్టర్‌కు

వినియోగదారుల ఫోరం భారీ వడ్డన

అన్నవరం/కాకినాడ క్రైం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో మొబైల్ డిపాజిట్ కౌంటర్‌లో నిర్థిష్టమైన చార్జీలకన్నా అధికచార్జీ లు వసూళ్లు చేస్తున్నందున సంబంధిత కాంట్రాక్టర్‌కు సీహెచ్ రఘుపతి వసంతకుమార్, చెక్కా సుశీ, చాగంటి నాగేశ్వర్ రావ్‌లతో కూడిన కాకినాడ వినియోగదారుల కమిషన్ భారీగా జరిమానా విధించింది. వివరాలిలా ఉన్నాయి. కాకినాడకు చెందిన జల్లి గంపల లక్ష్మీనారాయణ గత ఏడాది నవంబరు 3వ తేదీన అన్నవరం సత్యన్నారాయణస్వామి దైవ దర్శనార్థం రూ.రెండు వందలతో టికెట్‌ను కొనుగోలుచేసి అనంతరం తన మొబైల్ ఫోన్‌ను సత్యదేవ మొబైల్ అండ్ కెమెరా డిపాజిట్ సెంటర్ ఈస్ట్ వన్‌లో డిపాజిట్ చేశాడు. దర్శనానంతరం ఈ బిల్ ద్వారా మొబైల్ ఫోన్ తీసుకునేందుకు డిపాజిట్ సెంటర్‌కు వెళ్లాడు. అక్కడ అదనంగా రూ.10 ఇవ్వాలని అడగ్గా ఏ బోర్డుపైన చెల్లించ వల్సిన రుసుము రూ.10ఏ బోర్డుపైన ఎందుకు ప్రదర్శించలేదని లక్ష్మీనారాయణ కౌంటర్‌లో ఉన్నవారిని అడిగాడు. దాంతో రూ.10 చెల్లించకపోతే మొబైల్ ఫోన్ తిరిగి ఇవ్వమని వారు బదులిచ్చారు. వెంటనే లక్ష్మీ నారాయణ సంబంధిత దేవస్థాన అధికారులకు ఫిర్యాదు చేయడానికి ప్రయత్నించగా స్పందించలేదు. దాంతో ఆయన గత ఏడాది డిసెంబరు 4న వినియోగదారుల ఫోరంను ఆశ్రయించాడు. సాక్ష్యాధారాలను పరిశీలించిన అనంతరం కమిషన్ రూ.5 వసూలు చేయడానికి మాత్రమే అనుమతి ఉందని, అయితే కాంట్రాక్టర్ మరో రూ.5ను అదనంగా వసూలు చేయడం తప్పిదంగా పరిగనిస్తూ ఫిర్యాదుకి కాంట్రాక్టర్ రూ.15 వేలు, అలాగే వ్యాజ్యం ఖర్చులకు రూ.5 వేలు చెల్లించాలని కమిషన్ ఆదేశించింది. అలాగే కాంట్రాక్టర్ దేవస్థానం యాజమాన్యానికి రూ.5లక్షలు జరిమానాగా చెల్లించాలని ఆదేశించింది. రెగ్యులేటరీ చర్యలలో భాగంగా దేవస్థానంలో అన్ని దుకాణాలలో సుంకం బోర్డులు ప్రదర్శించాలని మరింత దుర్వినియోగాలను అరికట్టేందుకు ఎప్పటికప్పుడు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని తూనికలు, కొలతలు శాఖకు సూచించింది.

వరుస ఫిర్యాదుల నేపథ్యంలో మేల్ నర్సుపై విచారణ

- ప్రత్యేక కమిటీ నియామకం

జీజీహెచ్ (కాకినాడ), ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లో మేల్ నర్సుగా పనిచేస్తున్న పోలాబత్తిన శ్రీనివాస్‌రావుపై వరుస ఫిర్యాదులు వస్తున్న నేపథ్య ంలో కలెక్టర్ ఆదేశాలతో ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శ్రీనివాసన్ ఆర్ఎంసీ ఏడీ శ్రీనివాస్‌లను విచారణాధికారులుగా నియమిస్తూ అలాగే సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి చైర్మన్‌గా ఒక ప్రత్యేక కమిటీని నియమించారు. ఇటీవల శ్రీనివాసరావు ఖాళీ పత్రాలపై సుమారు 60మంది స్టాఫ్ నర్సులతో సంతకాలు చేయించాడు. వారు ఎందుకు అని ప్రశ్నిస్తే నర్సుల సమస్యలను ఉన్నతాధికారులకు విన్నవించేందుకు అని చెప్పాడు. ఈవిషయంపై అధికారులు దర్యాప్తు చేపట్టి అతను నర్సులను తప్పుదోవ పట్టించాడని తనకు గిట్టని వారిపై కక్షపూరితంగా ఖాళీపత్రాలపై సంతకాలు చేయించాడని అధికారులు దర్యాప్తులో నిర్ధారణ అయింది. ఈ విషయంపై శ్రీనివాసరావు ఎన్‌జీవో సంఘ నాయకుల పేర్లను వాడుకోవడంపై ఆ సంఘ నాయకులు శ్రీనివాస్‌రావుపై సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేశారు. రిపబ్లిక్ డే సందర్భంగా కలెక్టర్ ద్వారా తనకు అవార్డు ఇచ్చేందుకు ఆసుపత్రి అధికారులు సిఫార్సు చేయలేదన్న అక్కసుతో అధికారులను రకరకాల బెదిరింపులకు గురిచేశారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ షాన్‌మోహన్ ఈవిషయాన్ని తీవ్రం గా పరిగణలోకి తీసుకున్నారు. నిజానిజాలను రాబట్టేందుకు ప్రత్యేకకమిటీ నియమించాలని సూపరిం టెండెంట్‌ను ఆదేశించిన నేపథ్యంలో కమిటీ ఏర్ప డింది. ఈనెల 15వ తేదీలోపు విచారణ పూర్తిచేసి నివేదిక అందజేయాలని కలెక్టర్ ఆదేశాలలో తెలియజేశారు.

ఆర్థిక ఇబ్బందులతో వివాహిత ఆత్మహత్య



మృతురాలు దుర్గాభవాని

చాగల్లు, ఫిబ్రవరి 13, (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో వివాహిత మహిళ పిల్లలతో సహ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం మండలంలోని చిక్కాలలో జరిగింది. ఎస్ఐ కే నరేంద్ర తెలిపిన వివరాలు ప్రకారం బొర్రా దుర్గాభవానికి (35), సురేంద్ర గౌడ్‌తో పదమూడు సంవత్సరాల క్రితం వివా హం జరిగింది. వారికి అమ్మాయి జోత్స్న రత్నశ్రీ (11), అబ్బా యి జయదీప్ (9) ఇద్దరు పిల్లలు ఉన్నారు. భర్త లారీ డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు, గత కొంతకాలంగా కుటుంబంలో ఆర్థిక ఇబ్బందులు చోటుచేసుకున్నాయి. కుటుంబ ఆర్థికఇబ్బందులు తీరకపోగా మరింత ఎక్కువ కావడంతో ఆమె మానశింగాను డిప్రెషన్‌కు గురైంది. అన్నయ్య ఆమెను స్థానికంగానే వారి ఇంటికి తీసుకుని వెళ్లాడు. భర్త లారీపై కిరాయితో హైదరాబద్‌కు వెళ్లాడు. ఎవరు లేని సమయంలో ఇంటి వద్దనే కలుపు మందు పిల్లలకు తాగించి ఆమె తాగింది. తాను చనిపోతే పిల్లలు ఆలన పాలన ఉండదని, ఇబ్బంది పడతారనే ఉద్దేశంతో వారికి కూడ పురుగుమందు తాగించింది. విష యం తెలుసుకున్న బంధువులు వైద్యం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా దుర్గాభవాని మార్గమధ్యలోనే మరణించింది. పిల్లలు రాజమహేంద్రవరంలోని ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నా రు. మృతురాలి అన్నయ్య రామకృష్ణ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వైన్‌షాపులపై మెరుపుదాడులు

కాకినాడ క్రైం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): నిబంధనలను అతిక్రమించిన వైన్‌షాపుల పై కాకినాడ ఎస్‌డీపీవో మనీష్ దేవరాజ్ పాటిల్ ఐపీఎస్ ఆధ్వర్యంలో మెరుపుదాడులు నిర్వహించారు. ఎస్పీ జి.బింధుమాదవ్ ఆదేశాను సారం ఎస్‌డిపిఓ ప్రత్యేక పోలీస్ బలగాలతో కలిసి నిబంధనలకు విరుద్ధంగా రాత్రి 10గంటల తరువాత తెరచి ఉంచిన వైన్‌షాప్‌లపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడులు కాకినాడ సిటీలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నాలుగు షాపులు, త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండుషాపులు, సర్పవరం పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండుషాపులు మొత్తం 8షాపులపై దాడులు నిర్వహించి కేసులు నమోదు చేశారు.

సైన్స్ అండ్ టెక్నాలజీ కౌన్సిల్ సభ్య కార్యదర్శిగా శరత్‌కుమార్

అమరావతి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఏపీసీవోఎస్‌టీ) సభ్య కార్యదర్శిగా కేఎల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ కె.శరత్‌కుమార్‌ను ప్రభుత్వం నియమించింది. రెండేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగవచ్చని పేర్కొంది. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. డాక్టర్ శరత్‌కుమార్ గుంటూరు జిల్లా వడ్డేశ్వరంలోని కేఎల్ వర్సిటీలో ఆర్ అండ్ డీ, పీఆర్ ప్రొఫెసర్‌గా ఉన్నారు.

ఆబోతును ఢీకొని వ్యక్తి మృతి



మురళీకృష్ణ(ఫైల్)

అంతర్వేది, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమజిల్లా సఖినేటిపల్లి మండలం మోరిపోడు గ్రామానికి చెందిన మురళీకృష్ణ బుధవారంరాత్రి ద్విచక్ర వాహనంపై వెళుతూ ఆబోతును ఢీకొని మృతి చెందినట్టు భార్య శిరీష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కె.దుర్గాశ్రీనివాస్ తెలిపారు. సంవత్సరం క్రితం వివాహమైన మురళీకృష్ణకు జనవరి నెలలో పాప పుట్టింది. గురువారం భార్యతో మోరిపోడు వెళ్లివస్తానని చెప్పిన మురళీకృష్ణ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంపై ఇరువురు కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగి తేలారు. మోటారుసైకిల్‌పై వెళుతున్న మురళీకృష్ణ ఆబోతును ఢీకొనడంతో మెడపై తీవ్ర గాయమై రక్తస్రావంతో పడి ఉన్నారని స్థానికులు అందించిన సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్టు తెలిపారని ఫిర్యాదులో శిరీష పేర్కొన్నారు.

21న పెన్షన్ అదాలత్ : కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి):ఈనెల 21న పెన్షన్ కేసులు, జీపీఎఫ్ కేసులను సమీక్షించడానికి పెన్షన్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ తెలిపారు. ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. కాకినాడ కలెక్టరేట్ కార్యాలయంలో విధాన గౌతమి మీటింగ్ హాల్‌లో ఉదయం 10గంటలకు పెన్షన్, జీపీఎఫ్ అదాలత్ జరుగుతుందన్నారు. జిల్లా అధికారులు, డ్రాయింగ్ అండ్ పంపిణీ అధికారులు పెండింగ్‌లో ఉన్న పెన్షన్ కేసులు, సమస్యల వివరాలతో హాజరుకావాలన్నారు.

ఆదివాసీలపై మారణకాండ ఆపాలి

ఆపరేషన్ కగార్‌ను వ్యతిరేకిస్తూ ప్రజాసంఘాల ధర్నా



అంబేద్కర్ విగ్రహం సెంటర్‌లో ధర్నా చేస్తున్న ప్రజాసంఘాలు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీలపై సృష్టించిన మారణకాండను ఆపాలని ప్రజాసంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్‌ను వ్యతిరేకిస్తూ స్థానిక గోకవరం బస్టాండ్ అంబేడ్కర్ విగ్రహం సెంటర్‌లో గురువారం సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు జె.సత్తిబాబు, పీకేఎస్ రాష్ట్రాధ్యక్షుడు ఎస్‌కే మస్తాన్, పీవోడబ్ల్యు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మల్లిక, కేవీపీఎస్ నాయకుడు కోనాల లాజర్, కే.జోజి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దేశంలోని అడవి ప్రాంతాల్లో ఉన్న ఖనిజ సంపదను కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పడానికి ఆపరేషన్ కగార్ పేరుతో గిరిజనులను అడవి నుంచి వెళ్లగొట్టడానికి, చంపడానికి చేస్తున్న ప్రయత్నాలను వ్యతిరేకిస్తున్నామన్నారు. దేశ సంపదను సామ్రాజ్య వాదులకు కట్టబెట్టేందుకు కగార్ పేరుతో వేలాది మందిని హతమార్చడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రస్తుతం బీజాపూర్‌లో కొనసాగుతున్న మారణ హోమాన్ని ఆపివేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో పి.నాగేశ్వరరావు, కె.అప్పారావు, పి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటిలో సోక్ పిట్లు నిర్మించాలి

» డ్వామా పీడీ నాగమహేశ్వరరావు » ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లకు శిక్షణ

బిక్కవోలు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): హౌసింగ్ కాలనీల్లో ఇంటి నిర్మాణం పూర్తయిన ప్రతి ఇంటిలో సోక్ పిట్లు నిర్మించాలని డ్వామా పీడీ నాగమహేశ్వరరావు ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం బిక్కవోలు, రంగంపేట, అనపర్తి మండలాలోని ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉపాధి హామీ పథకంలో ఫారమ్ పాండ్లు, సోక్ పిట్లు, ఫిష్ పాండ్ల నిర్మాణాలకు ఒక రోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ రంగంపేట మండలంలో 25 ఫారమ్ పాండ్లు నిర్మించాలని, మైనర్ ఇరిగేషన్ చెరువు లున్న ప్రతి గ్రామంలోను ఫిష్ పాండ్లు నిర్మించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వి.శ్రీనివాస్, ఏపీవో అగస్టీన్‌కుమార్, రీసోర్సు పర్సన్స్ ఈసీ సందీప్‌రెడ్డి పాల్గొన్నారు.

భూములు ఇవ్వకుంటే ఆత్మహత్యలే శరణ్యం

వెలుగుబందలో రైతులు ఆందోళన

రాజానగరం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : జగనన్న కాలనీ పేరుతో గత ప్రభుత్వం సేకరించిన తమ భూములను తిరిగి వెనక్కి ఇప్పించాలంటూ సంబంధిత రైతులు గురువారం ఆందోళన చేపట్టారు. మండలంలోని వెలుగుబంద గ్రామ పరిధిలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. పేదలకు ఇళ్ల పేరున గత ప్రభుత్వం ఇళ్ల స్థలాలు పంపిణీలో భాగంగా వెలుగుబందలో ఎకరం రూ.85 లక్షలు వంతున చెల్లించే విధంగా సంబంధిత అధికారులు రైతులతో ఎప్పందం చేసుకున్నారు. దాదాపు 60 మంది నుంచి సుమారు 80 ఎకరాల భూములను సేకరించి యజమానుల నుంచి దస్తావేజులు, పట్టాదారు పాసుపుస్తకాలు తీసుకున్నారు. ఇందుకు సంబంధించి ఇప్పటివరకు డబ్బులు ఇవ్వకపోగా భూములపై హక్కులు కోల్పోయా మన్నారు. తమ భూముల రికార్డులను రెవెన్యూ అధికారులు రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఇప్పించారని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. తమ భూములకు డబ్బులు చెల్లించాలని, లేదా దస్తావేజులు ఇచ్చేయాలన్నారు.

మార్కెటింగ్ ప్రణాళికలపై విద్యార్థులకు వర్క్‌షాప్

రాజానగరం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): డిజిటల్ మార్కెటింగ్ సాధనాల ద్వారా వినియోగదారులను సమర్థవంతంగా చేరుకోవచ్చని గైట్ స్వయంప్రతిపత్తి కళాశాల ప్రిన్సిపాల్ టి.జయానందకుమార్ అన్నారు. జీజీయూ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం, ఇన్నోవేషన్ కౌన్సిల్ సంయుక్త ఆధ్వర్యంలో వర్ధమాన వ్యాపార నిర్వాహకులకు మార్కెటింగ్ ప్రణాళికలు అనే అంశంపై గురువారం వర్క్‌షాపు నిర్వహించారు. జయానంద కుమార్ వ్యాపారాలను పెంచుకునేందుకు అమలు చేయాల్సిన మార్కెటింగ్ వ్యూహాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో జీజీయూ డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ పీఎంఎంఎస్ శర్మ, డీన్ ఎన్.లీలావతి, ప్రిన్సిపాల్ ఎస్‌వీఎస్ఎన్ మూర్తి, వి.నరేంద్రకుమార్, బీవీఆర్ నాయుడు పాల్గొన్నారు.

లాయర్ల రక్షణ చట్టం తేవాలి

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తక్షణమే న్యాయవాదుల రక్షణ చట్టం అమలు చేయాలని అడ్వకేట్స్ వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర కమిటీ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు గురువారం రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయం అధికారులకు రాష్ట్ర కమిటీ ప్రతినిధులు, న్యాయవాదులు ఒక వినతిపత్రం అందజేశారు.

కనీస వేతనాలు చెల్లించాలి

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఓఎన్‌జీసీ బేస్ కాంప్లెక్స్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు డ్రైవర్ల కష్టాన్ని కాంట్రాక్టర్లు, ఒక యూనియన్ నాయకుడు దోచుకుంటున్నారని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు టి.అరుణ్ ఆరోపించారు. గురువారం స్థానిక ఓఎన్‌జీసీ బేస్ కాంప్లెక్స్ మెయిన్‌గేటు వద్ద ఓఎన్‌జీసీ కాంట్రాక్టు డ్రైవర్లు, సీఐటీయూ నాయకులు ధర్నా నిర్వహించారు.

వాహనదారులకు డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి

కోరుకొండ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నార్త్‌జోన్ పరిధిలో డీఎస్పీ వై.శ్రీకాంత్ ఆధ్వర్యంలో మండల ఆటో యూనియన్లకు యజమానులకు గురువారం కోరుకొండలో అవగాహన సదస్సు నిర్వహించారు. అందరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, యూనిఫామ్ ధరించాలని, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదని, యాక్సిడెంట్ అయిన ప్రాంతాల్లో గాయపడిన వారిని ఆసుపత్రికి తీసుకెళ్లాలా ఆటో డ్రైవర్ల సహకరించాలన్నారు. గంజాయి, మద్యం, సారా, రవాణాకు సహకరించొద్దని, వారి సమాచారం పోలీసులకు అందించాలన్నారు. ప్రతిఒక్కరు ట్రాఫిక్ రూల్స్ పాటించి సక్రమంగా ఆటోలు నడపాలన్నారు.

నూతన ఇసుక రీచ్‌పై ప్రజాభిప్రాయ సేకరణ

సీతానగరం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): గ్రామ ప్రజల అభిప్రాయంతోనే నూతన ఇసుక ర్యాంపు ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని జిల్లా జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు తెలిపారు. గురువారం మునికూడలి గ్రామంలో నూతన ఇసుక ర్యాంపు ఏర్పాటుపై స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద పర్యావరణ, ప్రజాభిప్రాయ సేకరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునికూడలి ఓపెన్ రీచ్‌లో గోదావరి పరివాహక ప్రాంతలో 28.5 హెక్టార్ల ప్రభుత్వ భూమిలో ఇసుక తవ్వకాలు జరుపుతామన్నారు. దీనిపై గ్రామ ప్రజల ఏకాభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకుని ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. ప్రజాభిప్రాయ సేకరణలో పలువురు మాట్లాడుతూ ఇసుక ర్యాంపు ఏర్పాటు వల్ల కూలీలకు ఉపాధితో పాటు గ్రామాభివృద్ధి జరుగుతుందన్నారు. అయితే ఇసుక ర్యాంపు ఏర్పాటుతో వాహనాలు ఇష్టారాజ్యంగా వెళ్లడం వల్ల ప్రమాదాలు జరుతాయన్నారు. గ్రామాల వద్ద వాహనాలు వేగంగా వెళ్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గోదావరి వరద సమయంలో ఏటిగట్టు కోతకు గురవుతుందని, రక్షణ గోడ కట్టాలని, తరచూ వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, ఆలయాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని దుమ్ము ధూళి ఎగరకుండా రోడ్డును నీటితో తడపాలని పలువురు సూచించారు. కార్యక్రమంలో మైన్స్ ఏడీ ఫణిభూషన్, తహశీల్దార్ ఎ.శ్రీనివాస్, పంచాయతీ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు

పి.వీరంపాలెంలో ఆరుగురికి డయేరియా

రంగంపేట, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాతవీరంపాలెంలో ఆరుగురికి డయేరియా సోకడంతో గ్రామస్థులు భయభ్రాంతులకు గుయ్యారు. గురువారం ఉదయం ఇద్దరు స్థానికులకు అతిసారం లక్షణాలు కనిపించడంతో స్థానిక ఏఎన్ఎం ఈ విషయాన్ని సింగంపల్లి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ సంకీర్తనకు తెలియజేయగా తక్షణమే స్పందించిన రంగంపేట, సింగంపల్లి వైద్యాధికారులు గ్రామంలో సర్వే చేయగా ఆరుగురు అనుమానితులను గుర్తించారు. పంచాయతీ సిబ్బంది గ్రామమంతా శానిటేషన్ పనులు చేయించారు. అనుమానితుల్లో ముగురికి ఇంటి వద్దనే వైద్యం అందించడంతో పరిస్థితి అదుపులోనే ఉందని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో సుధాకర్ తెలిపారు. ఇదిలా ఉండగా గ్రామాన్ని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సందర్శించి డయేరియా బాధితులను పరామర్శించారు. ఆరుగుఽకి వేరే వేరే కారణాలతో డయేరియా వీరికి సోకింది తప్ప అందరికీ ఒకే కారణం కాదన్నారు. పరిస్థితి పూర్తిగా అదుపులోకి వచ్చే వరకు మెడికల్ క్యాంప్ కొనసాగించాలని వైద్యాధికారులను ఆదేశించారు. గ్రామంలో డయేరియా ప్రబళడంతో నిరంతరాయంగా వైద్యసేవలందిస్తున్నామని రంగంపేట, సింగంపల్లి, పీహెచ్‌సీ వైద్యాధికారులు వేణుశ్రీలక్ష్మీ, సంకీర్తన, చిన్నారావు తెలిపారు. పరిస్థితి అదుపులోనే ఉందని ప్రజలు ఎటువంటి భయభ్రాంతులకు గురికావద్దన్నారు. బాధితులను పరామర్శించిన వారిలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ల గోవింద్, నీలపాల త్రిమూర్తులు, ఎలుగుబంటి సత్తిబాబు, ఉద్దండ్రావు శ్రీను, పోతుల వెంకటరావు, ఎం.సాయిరాం, ఎంపీడీవో సాయిబాబు, ఈవోపీఆర్డీ పి.వెంకటరత్నం ఉన్నారు.

హరిహర క్షేత్రం పరిశీలన

కడియం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా కడియపులంక హరిహర మహాక్షేత్రంలోని అనంతేశ్వరస్వామి ఆలయం, సమీపంలో అభయాంజనేయస్వామి ఆలయాల వద్ద భక్తులకు, ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీలు చర్యలు తీసుకోవాలని డీఎస్పీ భవ్యకిషోర్ తెలిపారు. గురువారం ఆమె సదరు ఆలయాలను సందర్శించారు. ఏర్పాట్లపై ఆలయ చైర్మన్ మార్గాని సత్యనారాయణను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కడియంలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను డీఎస్పీ పరిశీలించారు.

ఈస్ట్‌రైల్వే స్టేషన్ రోడ్డు విస్తరణకు ప్రణాళిక

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ఈస్ట్‌రైల్వేస్టేషన్ రోడ్డును నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్‌గార్గ్ పరిశీలించారు. గురువారం ఈస్ట్‌రైల్వే స్టేషన్ రోడ్డుకు వెళ్లిన కమిషనర్ మాస్టర్ ప్లాన్‌ను పరిశీలించారు. ఈ రోడ్డును 40నుంచి 80అడుగుల వెడల్పునకు విస్తరిస్తున్నట్టు తెలిపారు. రెండు కిలోమిటర్ల మేరకు విస్తరణ పనులు జరుగుతాయన్నారు. మొత్తం ప్రభావిత భవనాలు, స్థలాలు సుమారు 200 ఉన్నాయని వీటిని ఫేజ్-4లుగా విభజించినట్టు చెప్పారు. ప్రస్తుత ఫేజ్-2, 3 ఇప్పటి అమోదం పొందినందున రోడ్డు విస్తరణ పనులు మొదలు పెట్టాలని ఆదేశించారు. స్థలాధిపతులతో సమావేశం నిర్వహించి టీడీఆర్ అందజేస్తామని కమిషనర్ పేర్కొన్నారు.

వైభవంగా పుష్పోత్సవం

ముగిసిన ఉత్సవాలు

ధవళేశ్వరం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): జనార్ధన స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి పుష్పోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం విశేష పూజలు అనంతరం సాయంత్రం ద్వాదశ అర్చనలు నిర్వహించారు. రాత్రి ద్వాదశ ప్రదక్షణలు స్వామి అమ్మవార్లను వివిధ రకాల పువ్వులతో అలంకరించి మధురుపదార్థాలతో నివేదన చేశారు. దంపతులకు తాంబూలాలు అందజేశారు.పుష్పోత్సవంతో స్వామి వారి కల్యాణోత్సవాలు ముగిశాయి.

ఉచిత వైద్యశిబిరం

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక గాంధీపురం-2లో సుంకర భాస్కరరావు మునిసిపల్ హైస్కూల్లో గురువారం ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. విద్యార్థులకు ఈఎన్‌టీ, దంత, చర్మవ్యాధుల పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్లు వి.శ్రీవిద్య, ఎస్.మురళీకృష్ణ, ఎస్.రవికాంత్ సేవలందించారు. కార్యక్రమంలో హెచ్ఎం సన్యాసిరావు, పాఠశాల పూర్వ విద్యార్థి సుంకర నాగేంద్రకిషోర్, పీఎంసీ చైర్‌పర్సన్ సీహెచ్ బాల లక్ష్మి నరసమాంబ పాల్గొన్నారు.

సోమాలమ్మ జాతర

గోకవరం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ప్రజలకు మరిన్ని సేవలందించేందుకే తాను రాజకీయాల్లోకి వచ్చినట్టు విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని గంగంపాలెంలో గురువారం జరిగిన గ్రామదేవత సోమాలమ్మ జాతర ఉత్సవాలకు ఆయన విచ్చేసి మాట్లాడారు. ఆలయాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానన్నారు. అనంతరం అన్నసమారాధన నిమిత్తం రూ.10,116ను కమిటీ సభ్యులకు ఆయన విరాళంగా అందజేశారు. లక్కీడ్రా నిర్వహించి 100 మంది మహిళా విజేతలకు చీరలు అందజేశారు.

సారా స్థావరంపై దాడి

రంగంపేట, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలం లోని గ్రామంలో సారా స్థావరాలపై గురువారం దాడులు నిర్వహించినట్టు ఎక్సైజ్ సీఐ సుధ తెలిపారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన కాలా యేసుప్రసాద్‌ను అరెస్ట్ చేసి అతడి నుంచి 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, 400 లీటర్ల బెల్లపుఊటను ధ్వంసం చేసినట్టు చెప్పారు. దాడుల్లో ఎస్ఐ దుర్గాప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారన్నారు.

టాటూ వివాదం..గంజాయి..

అబ్జర్వేషన్ హోంకి బాలుడు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మంగళవారపుపేటకు చెందిన ఓ బాలుడు ఆ ప్రాంతంలో ఉన్న ప్రసూతి ఆస్పత్రి వద్ద బొత్సా హరీశ్‌పై 2022లో హత్యాయత్నం చేశాడు. దీనికి అంతకు ముందు వారిద్దరి మధ్య టాటూ వివాదం ఉందని వన్‌టౌన్ పోలీసుల దర్యాప్తులో తేలింది. అయితే ఆ బాలుడిని అదుపులోకి తీసుకోగా అతడి వద్ద 10గ్రాముల గంజాయి ఉండడంతో ఎన్‌డీపీఎస్ చట్టం కింద కూడా కేసు పెట్టారు. విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో విశాఖపట్నంలోని ప్రత్యేక అబ్జర్వేషన్ హోంకి తరలించాలని జువైనల్ జస్టిస్ బోర్డు మేజిస్ట్రేట్ రమ్య చావలి ఆదేశించారని పోలీసులు తెలిపారు.

డ్రైవర్ వద్ద నగదు దోపిడీ

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లాకు చెందిన వి.చంద్రుడు లారీలో లోడు వేసుకొచ్చి. ఇక్కడి నుంచి మరో లోడు వేసుకెళ్లే క్రమంలో దివాన్ చెరువు వెళుతున్నాడు. మధ్యంలో ఐవోసీఎల్ బంకు సమీపంలో మూత్ర విసర్జన కోసం లారీ ఆపాడు. ఆ సమయంలో ముగ్గురు వ్యక్తులు బైక్‌పై వచ్చి తన వద్ద ఉన్న సెల్‌ఫోన్, రూ.8వేల నగదు దోపిడీ చేశారనే ఫిర్యాదుతో బొమ్మూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఓఎన్‌జీసీ ఉద్యోగి ఆత్మహత్య!

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): అసోం రాష్ట్రానికి చెందిన సునీల్ మెక్(55) స్థానిక ఓఎన్‌జీసీలో డిప్యూటీ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఆయన గాంధీపురం-4 ప్రాంతంలో ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్నారు. గురువారం ఉదయం ఆయన డ్రైవర్ వెళ్లి చూడగా ఉరి వేసుకున్న స్థితిలో ఉన్నారు. త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రంగంపేట, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): వడిశలేరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ టౌన్, రూరల్ ఫీడర్లకు విద్యుత్ సరఫరాలో నిలిపి వేయనున్నట్టు ట్రాన్స్‌కో ఏఈ దాట్ల శ్రీధర్‌వర్మ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు వడిశలేరు, ముకుందవరం గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

రహదారి భద్రతపై అవగాహన పెరగాలి

» జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు
» రాజమహేంద్రవరంలో కార్లు, ఆటోలు, మోటారుసైకిళ్లతో భారీ అవగాహన ర్యాలీ



అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న జేసీ చిన్నరాముడు

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలు జరగకుండా రహదారి భద్రతపై ప్రజల్లో అవగాహన పెరగాల్సి ఉందని, అందుకోసం ప్రచారం నిర్వహిస్తున్నామని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు అన్నారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా గురువారం రాజమహేంద్రవరంలో జిల్లా రవాణాశాఖ ఆధ్వర్యంలో కార్లు, ఆటోలు, మోటారుసైకిళ్లతో కూడిన భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని జేసీ చిన్నరాముడు స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల గ్రౌండులో అడిషనల్ ఎస్పీ ఏవీ సుబ్బారావు, జిల్లా రవాణా అధికారి ఆర్.సురేష్‌తో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలన్నారు. హెల్మెట్ ధరించకపోవడం, ట్రాఫిక్ రూల్స్ పాటించకపోవడం వల్ల ఏటా అనేక మంది వాహనదారులు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. అడిషనల్ ఎస్పీ ఏవీ సుబ్బరాజు మాట్లాడుతూ రోడ్డు భద్రతా నిబంధనలు పాటించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా రవాణా అధికారి సురేష్ మాట్లాడుతూ వాహన ప్రమాదాలు నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక అవగాహన కార్యక్రమాలు రూపొందిస్తోందని, వాటిని తాము ప్రజల్లోకి తీసుకెళుతున్నామన్నారు. ప్రజల్లో చైతన్యం రావాలనే ఈ అవగాహన ర్యాలీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. మితిమీరిన వేగంతోపాటు వాహనాల్లో నిర్దేశిత సంఖ్య కంటే ఎక్కువ మంది ప్రయాణిస్తున్నారని, ఇది చట్టరీత్యా నేరమని అన్నారు. ఈ నెల 15వ తేదీ వరకూ రహదారి భద్రత మాసోత్సవాలు జరుగుతాయని వెల్లడించారు. కార్యక్రమంలో ఎంవీఐలు సీహెచ్ సంపత్‌కుమార్, ఏఎంవీఐలు జి.రాధికా దేవి, పీవీవీడీ సాయికుమార్, రోడ్డు సేఫ్టీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.మాధురి, పెద్ద సంఖ్యలో ద్విచక్రవాహనదారులు, క్యాబ్, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థిని గెలిపించండి

ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి, నల్లమిల్లి
పలుచోట్ల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



రాజమహేంద్రవరంలో ఓటర్లను అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఉభయ ఉమ్మడి గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ కోరారు. గురువారం రాత్రి స్థానిక 9వ డివిజన్ వెంకటేశ్వరనగర్‌లో తెలుగు మహిళ నగర అధ్యక్షురాలు కోసూరి చండీప్రియతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. ఓటర్ల ఇళ్లకు వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. కూటమి అభ్యర్థిని గెలిపించడం వల్ల నిరుద్యోగుల సమస్యలు పరిష్కారమంతాయని, పట్టభద్రుల ప్రయోజనాలను రాజశేఖర్ కాపాడుతారని చెప్పారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం రూరల్: మండలంలోని హుకుంపేటలో టీడీపీ హెల్త్ విభాగం రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ గోరంట్ల రవిరామ్ కిరణ్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులైన ఓటర్లను కలిసి కరపత్రాలు అందించి మొదటి ప్రాధాన్య ఓటును పేరాబత్తుల రాజశేఖర్‌కు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మజ్జి పద్మావతి, పరిశీలకుడు ఎం.తేజోపతి, మత్సేటి ప్రసాద్, దుద్దుపూడి రమేష్, బొప్పన నానాజీ, తనూజ, మణి, మంగ, కోరాడ వెంకటేష్ పాల్గొన్నారు.

బిక్కవోలు: మండలంలోని ఇల్లపల్లిలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా స్థానిక జడ్పీ హైస్కూల్లో పట్టభద్రుల ఉపాధ్యాయులను రాజశేఖరానికి మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం గ్రామంలో పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి కరపత్రాలను అందజేసి ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, పడాల రాము, తనుకు శ్రీధర్, కానేటి అప్పల స్వామి పాల్గొన్నారు.

రంగంపేట: మండలంలోని నల్లమిల్లి, సింగంపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఇంటింటా ప్రచారం నిర్వహించి పట్టభద్రుల ఓటర్లను కలిసి కరపత్రాలను పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం ఏడు నెలల్లో చేసిన అభివృద్ధిని, రాబోయే రోజుల్లో చేయబోయే అభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో ఎన్నికల పరిశీలకుడు చింతల రామకృష్ణ, ఆళ్ల గోవింద్, నీలపాల త్రిమూర్తులు, ఎలుగుబంటి సత్తిబాబు, పోతుల వెంకట్రావు, ఎం.సాయిరాం, గిరజాల సత్తిబాబు పాల్గొన్నారు.

అనపర్తి: మండలంలోని లక్ష్మీనరసాపురంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడి కూటమి నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిసి కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో తమలంపూడి సుధాకరరెడ్డి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, కర్రి బులిరెడ్డి, కర్రి శేషారత్నం, పడాల వెంకటరామారెడ్డి పాల్గొన్నారు. అలాగే అనపర్తిలోని శేషగిరిరావు పేట, రాముడమ్మ పేట, వెంకటరత్నం, పంచాయతీ వీధుల్లో కూటమి నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించి ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో చింతా ప్రకాశరెడ్డి, బ్రూస్‌లీ, వేగిరెడ్డి రాధ పాల్గొన్నారు

కడియం: ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు విజయాన్ని అందించడం అందరి బాధ్యత అని రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ అన్నారు. కడియం మండలం వేమగిరి విచ్చేసిన ఆయనకు టీడీపీ నాయకుడు చెల్లుబోయిన శ్రీనివాసరావు మొక్కను అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ పేరాబత్తుల విజయానికి కూటమి నాయకులంతా సమిష్టిగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వాసంశెట్టి నాగబాబు, గుత్తుల శేషగిరి, పితాని గోవిందు, పితాని నారాయణరావు పాల్గొన్నారు..

అంగన్‌వాడీల్లోనే చిన్నారుల శారీరకాభివృద్ధి

» ఇన్‌చార్జి సీడీపీవో ఎన్‌కే దుర్గమణి
» కార్యకర్తలకు పోషణ్ బీ, పడాయి బీ శిక్షణ తరగతులు



పాతతుంగపాడులో కృత్యాలు చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

రాజానగరం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): 0-6 సంవత్సరాల వయసున్న చిన్నారుల్లో అన్ని రకాల శారీరకాభివృద్ధి ప్రక్రియ అంగన్‌వాడీ కేంద్రాల్లోనే జరగాలనే ఉద్దేశంతో ప్రభుత్వం పోషణ్ బీ, పఢాయి బీ శిక్షణా కార్యక్రమాన్ని రూపొందించినట్టు ఇన్‌చార్జి సీడీపీవో ఎన్‌కే దుర్గమణి పేర్కొన్నారు. రాజానగరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు మూడు రోజుల పాటు జరిగే శిక్షణా తరగతులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజానగరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని 311 కేంద్రాలకుగాను 304మంది వర్కర్లు పనిచేస్తున్నారన్నారు. మండలంలో రాజానగరం, తుంగపాడు శిక్షణా కేంద్రాల్లో బ్యాచ్‌కు 50 మంది వంతున మూడు రోజులు పాటు శిక్షణ కల్పిస్తున్నామన్నారు. అలాగే కడియం, రాజమహేంద్రవరం రూరల్ మండలాల్లో రెండేసి చొప్పున శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. శిక్షణా తరగతుల్లో భాగంగా చిన్నారుల్లో శారీరక చలన కండరాలు, మేధస్సు, భాష, గణిత, సాంఘిక, భావోద్వేగ అభివృద్ధి, సృజనాత్మకత తదితర అంశాలపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు.

దివాన్‌చెరువు: దివాన్‌చెరువు, పుణ్యక్షేత్రం సెక్టార్లలోని అంగన్వాడీ కార్యకర్తలకు పాతతుంగపాడులోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రారంభమైన శిక్షణా కార్యక్రమంలో సూపర్‌వైజర్ భూదేవి మాట్లాడారు. మూడురోజులపాటు జరిగే ఈ శిక్షణలో అంగన్‌వాడీ కేంద్రాలను పోషకాహార కేంద్రాలుగా మాత్రమే కాకుండా విద్యను అందించే కేంద్రాలుగా మార్చడం లక్ష్యమన్నారు. ఈ విధానంలో ప్రవేశపెట్టబడిన మార్పుల ద్వారా ప్రతి బిడ్డకు ప్రతి రోజూ కనీసం రెండు గంటలపాటు అధిక నాణ్యమైన ప్రీస్కూల్ బోధన అందించనున్నట్టు పేర్కొన్నారు. శిక్షణలో రెండు సెక్టార్ల వర్కర్లు పాల్గొన్నారు.

అనపర్తి: అనపర్తిలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈ శిక్షణ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాల వివరాలను వివరించారు. శిక్షణలో అనపర్తి, బిక్కవోలు మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

» కారు ఢీకొనడంతో ప్రమాదం
» మృతదేహంతో ప్రమాదానికి కారకుడైన వ్యక్తి ఇంటి వద్ద బంధువుల ఆందోళన



పొలమూరులో ఆందోళన చేస్తున్న మృతుడి బంధువులు

అనపర్తి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాల పాలైన వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. పోలీసులు, మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 7న అనపర్తి మండలం పొలమూరుకు చెందిన సత్తి వెంకటరెడ్డి(56) రాత్రి 7గంటల ప్రాంతంలో సైకిల్‌పై అనపర్తి వస్తున్నాడు. ఈ క్రమంలో అనపర్తి వైపు వెళుతున్న కారు ఢీకొనడంతో తీవ్రగాయాల పాలయ్యాడు. దీంతో అతడిని స్థానికులు అనపర్తిలోని ఓ ఆసుపత్రికి ఆపై రాజమహేంద్రవరంలోని ప్రయివేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందాడు. పోస్టుమార్టం అనంతరం పోలీసులు మృతదేహన్ని గురువారం బంధువులకు అప్పగించారు. దీంతో మృతదేహాన్ని అంబులెన్స్‌లో ప్రమాదానికి కారకుడైన కారు యజమాని ఊరు పొలమూరు తీసుకువచ్చి అతని ఇంటి ముందు బైఠాయించి ఆందోళన చేపట్టారు. అయితే అప్పటికే ఇంటిలోని వారంతా తాళాలు వేసుకుని వెళ్లిపోవడంతో బంధువులు అక్కడే బైఠాయించారు. చివరకు పోలీసులు రంగప్రవేశం చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో వారు మృతదేహన్ని అంత్యక్రియ నిమిత్తం తరలించారు. అనపర్తి ఏఎస్ఐ దుర్గాప్రసాద్ ఈ కేసును దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా గ్రామోత్సవాలు

రాజానగరం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చక్రద్వారబంధంలో నిర్మించిన శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి, రాజానగరం రావులచెరువు గట్టున నిర్మించిన శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రతిష్ఠ ఉత్సవాల్లో భాగంగా గురువారం గ్రామోత్సవాలను ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా చక్రద్వారబంధంలో గణపతిపూజ, పంచగవ్యప్రాశన, రక్షాబంధనం, రుత్విక్‌వరుణ, యాగశాల ప్రవేశం, అఖండ, మండపారాధన ఘనంగా జరిపించారు. అలాగే రాజానగరంలో ఆర్యవైశ్య మహిళలు కలశాలతో గ్రామోత్సవం చేపట్టారు. కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రోగి బంగారం మాయం

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): టీ.నగర్‌కి చెందిన ఎం.తాతయ్య శాస్త్రి తన భార్య రామలక్ష్మీకి వైద్యం నిమిత్తం ఈ నెల 5న ఎస్ఆర్ ఆస్పత్రిలో చేర్చారు. అయితే తన భార్య మెడలోని బంగారు మంగళ సూత్రం, చేతి గాజులు.. మొత్తం నాలుగు కాసుల బంగారు వస్తువులు దోచుకున్నారనే ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని టూటౌన్ సీఐ మంగాదేవి పేర్కొన్నారు.

ప్రకృతి వ్యవసాయ రైతు చంటికి సత్కారం



కడియం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ ప్రాముఖ్యతను తెలియచేస్తూ రైతులను ఆ దిశగా నడిపిస్తున్న మాధవ రాయుడుపాలెం రైతు, సర్పంచ్ అన్నందేవుల చంటి సేవలు అభినందనీయమని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. రాజమహేంద్రవరం కలెక్టరేట్‌లో ఆమె అధ్యక్షతన జరిగిన ఖరీఫ్ యాక్షన్‌ప్లాన్ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులను ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం ద్వారా వివిధ రకాల పంటలను పండిస్తూ రైతులకు అవగాహన కల్పిస్తున్న అన్నందేవుల చంటిని సత్కరించారు. ఉద్యాన, ప్రకృతి వ్యవసాయ శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.



కాశీ నుంచి కన్యాకుమారి వరకు స్కేటింగ్

నల్లజర్లకు చేరిన ఉత్తరప్రదేశ్‌కు చెందిన మహిళ యాత్ర

8



వైభవంగా నరసన్న తెప్పోత్సవం, పుష్పోత్సవం





గురువారం రాత్రి జరిగిన స్వామి వారి పుష్పోత్సవం.. (ఇన్‌సెట్) తెప్పోత్సవ దృశ్యం

ముగిసిన అంతర్వేది కల్యాణ ఉత్సవాలు

6

బరిలో 35 మంది

- ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ
- 54 మంది నామినేషన్లు దాఖలు
- స్క్రూట్నీలో 11 నామినేషన్ల తిరస్కరణ
- పోటీ నుంచి 8 మంది విరమణ

ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు రంగం సిద్ధమైంది. గురువారం ఉపసంహరణల గడువు ముగియడంతో ఎవరు బరిలో నిలుస్తారో తేలిపోయింది. ఎనిమిది మంది పోటీ నుంచి విరమించుకోగా, పరిశీలనలో మరో 11 మంది నామినేషన్లు తిరస్కరించబడ్డాయి. దీంతో నామినేషన్లు వేసిన 54 మందిలో చివరకు 35 మంది బరిలో నిలిచారు. ఇక అసలు ఘట్టం మొదలుకానుంది. ఎన్నికల ప్రచార పర్వం మరింత వేగం పుంజుకోనుంది. -7లో



ఇంకా 'సిట్' అవదా..

- కాకినాడలో రేషన్ బియ్యం స్మగ్లింగ్‌పై అతీగతీలేని సిట్
- ప్రత్యేక సిట్ బృందాన్ని నియమించి రెండు నెలలు దాటినా విచారణ ఏదీ
- దర్యాప్తు అసలు ఎప్పుడు మొదలవుతుందో కూడా తెలియని పరిస్థితి
- గతేడాది నవంబరు నెలాఖరులో స్టెల్లా షిప్‌లో పట్టుబడ్డ రేషన్ బియ్యం
- అప్పట్లో కొద్దిరోజులపాటు రేషన్ బియ్యం స్మగ్లింగ్‌పై అట్టుడికిన కాకినాడ
- డిసెంబర్ 6న సిట్ నియమించిన తర్వాత నుంచీ నెమ్మదించిన చర్యలు
- మరోపక్క సిట్ దర్యాప్తు మొదలవకపోవడంతో రేషన్ మాఫియాలో దర్జా
- తమకేం కాదనే ధోరణిలో మళ్లీ మొదలైన రేషన్ బియ్యం కొనుగోళ్లు

కాకినాడ కేంద్రంగా కొనసాగిన వందల కోట్ల రేషన్ బియ్యం మాఫియాపై సిట్ దర్యాప్తునకు అతీగతీ లేకుండాపోతోంది. ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని నియమించి నెలలకు నెలలు గడుస్తున్నా అసలు విచారణ ఊసే లేదు. ఈనేపథ్యంలో అసలు రేషన్ మాఫియాపై సిట్ రంగంలోకి దిగుతుందా లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కాకినాడ నుంచి రూ.8 వేల కోట్లకుపైగా విలువైన బియ్యం నౌకల్లో విదేశాలకు ఎగుమతైంది. ఇందులో సగాని కిపైగా రేషన్ బియ్యమే. అయితే స్టెల్లా నౌకలో గతేడాది నవంబరులో రేషన్ బియ్యం పట్టుబడ్డ నేపథ్యంలో వేళ్లూనుకుపోయిన మాఫియా బట్టబయలైంది. దీంతో రేషన్ స్మగ్లింగ్ గుట్టు తేల్చ డానికి ప్రభుత్వం డిసెంబరు 6న సిట్‌ను నియమించింది. ఇది జరిగి రెండు నెలలకుపైగానే దాటిపోయినా సిట్ విచారణకు అసలు దిక్కులేకుండా పోయింది. అప్పట్లో నౌకలో రేషన్ బియ్యాన్ని పట్టుకోవడానికి డిప్యూటీ సీఎం పవన్ రావడం, షిప్‌ను సీజ్ చేయాలని ఆదేశించడంతో రాష్ట్రవ్యాప్తంగా సంచలనమైంది. తీరా విచారణ ఊసే లేకపోవడంతో అక్రమార్కులు మళ్లీ చెలరేగిపోతున్నారు.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

పేదలకు అందాల్సిన రేషన్ బియ్యాన్ని వైసీపీ అక్రమార్కులు చెరబట్టేసి గడచిన అయిదేళ్లలో భారీగా విదేశాలకు తరలించేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా రహస్య నెట్‌వర్క్‌ను ఏర్పాటుచేసి రేషన్ బియ్యం పేదలకు ఇలా అందగానే.. అలా కిలోకు రూ.10 చెల్లించి లక్షల టన్నులు కాకినాడకు తరలించడమే పనిగా పెట్టుకున్నారు. ప్రధానంగా వైసీపీ అధికారంలో ఉన్న అయిదేళ్లలో కాకినాడ సిటీ వైసీపీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి కుటుంబం, ఆయన అనుచరులు బియ్యాన్ని కనివినీ ఎరుగని రీతిలో బొక్కేశారు. పౌరసరఫరాలశాఖ పరిధిలోని రేషన్ బియ్యం వ్యవస్థను కుళ్లబొడిచేశారు. ప్రభుత్వం వందలకోట్లు సబ్సిడీ చెల్లించి పేదలకు ఇచ్చే బియ్యాన్ని సదరు నేత, ఆయన మనుషులు కారుచౌకగా కొట్టేసి దాన్ని సార్టెక్స్ యంత్రాల్లో పాలిష్‌చేసి ఆకర్షణీయ ప్యాకింగ్‌ల్లో ఉంచి నౌకల ద్వారా ఆఫ్రికా దేశాలకు అమ్మేసుకుని వేలకోట్లు గడించారు. ఒకరకంగా చెప్పాలంటే వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 2019-2020లో కాకినాడ యాంకరేజ్ పోర్టు నుంచి 19 లక్షల మెట్రిక్ టన్నులు, 2020-21లో 27 లక్షల మెట్రిక్ టన్నులు, 2021-22లో 29లక్షల మెట్రిక్ టన్నులు, 2022-23లో 38లక్షల మెట్రిక్ టన్నులు, 2023-24లో 24లక్షల మెట్రిక్ టన్నులు తరలిపోయింది. ఇందులో రేషన్ బియ్యం సగానికిపైనే. అయితే గతేడాది నవంబరు ఆఖరులో కాకినాడ నుంచి పశ్చిమ ఆఫ్రికాదేశానికి స్టెల్లానౌకలో రహస్యంగా ఎగుమతికి సిద్ధంచేసిన రేషన్ బియ్యం పట్టుబడడంతో స్మగ్లింగ్ వ్యవహారం అధికారికంగా బయటకు వచ్చింది. దీనిపై డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కాకినాడకు వచ్చి స్వయంగా షిప్ వద్దకు వెళ్లారు. ఆ తర్వాత రేషన్ ఆనవాళ్ల కోసం వెదికితే కాకినాడ, చుట్టుపక్క ప్రాంతాల్లో అనేక గోదాముల్లో ఎగుమతికి సిద్ధంగా ఉన్న రేషన్ బియ్యం పట్టుబడింది. ఈనేపథ్యంలో వేళ్లూనుకుపోయిన రేషన్ బియ్యం స్మగ్లింగ్‌పై రాష్ట్రప్రభుత్వం గతేడాది డిసెంబరులో ఉక్కుపాదం మోపింది. మాఫియాను అంతమొందించి అక్రమార్కులను శిక్షించే విధంగా ప్రత్యేకంగా సిట్‌ను నియమించింది. రేషన్ బియ్యం కాకినాడకు నలుమూలల నుంచి ఎలా చేరుకుంటోంది? ఎవరు తరలిస్తున్నారు? ఎక్కడి నుంచి తరలిస్తున్నారు? అక్కడి నుంచి ఏయే గోదాముల నుంచి మిల్లులకు వెళ్లి పాలిష్ చేసుకుని ఏయే కంపెనీల ద్వారా నౌకల్లో విదేశాలకు తరలిపోనున్నాయనేదానిపై ఈ సిట్ బృందం దర్యాప్తు చేపడుతుందని పేర్కొంది. ఈ క్రమంలో దర్యాప్తులో భాగంగా నిందితులను తక్షణం అరెస్ట్ చేసే అధికారం సైతం కల్పిస్తూ ఆదేశాలు జారీ చేసింది. అలాగే కాకినాడ, చుట్టుపక్కల మొత్తం అయిదు పోలీసుస్టేషన్ల పరిధిలో గతేడాది జూన్, జూలై నెలల్లో 13 రేషన్ బియ్యం స్మగ్లింగ్ కేసులు నమోదయ్యాయి. వీటన్నింటిపై కూలంకుషంగా దర్యాప్తుచేయాలని ఆదేశాల్లో ప్రభుత్వం పేర్కొంది. అయితే సిట్ బృందాన్ని నియమించిన నేపథ్యంలో అయిదు పోలీసుస్టేషన్ల పరిధిలోని 13 కేసులపై జిల్లా పోలీసులు సైతం లోతుగా విచారణ చేశారు. సిట్ దర్యాప్తునకు వస్తే తక్షణ నివేదిక ఇచ్చేలా వివరాలు సిద్ధం చేశారు. ప్రధానంగా కాకినాడ రూరల్ పోలీసుస్టేషన్ పరిధిలో జులై 11న రూ.26కోట్లు, జూన్ 28న కాకినాడ రూరల్ నియోజకవర్గం కరప స్టేషన్ పరిధిలో రూ.13.96 కోట్ల విలువైన రేషన్ బియ్యం పట్టుబడింది. ఇది లవన్ కంపెనీదిగా గుర్తించారు. కొటారి అమిత్‌కుమార్ అనే వ్యాపారిని నిందితుడిగా తేల్చారు. అయితే ఇదే లవన్ కంపెనీ పశ్చిమ ఆఫ్రికాకు బియ్యం ఎగుమతి చేస్తుండగా బార్జిలో 1,060 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యంతో పట్టుబడింది. అదేరోజు కరప స్టేషన్ పరిధిలో రూ.15.31 కోట్ల బియ్యం పట్టుబడింది. ఇది ద్వారంపూడి ప్రధాన అనుచరుడైన వినోద్ అగర్వాల్‌కు చెందిన సరళ ఫుడ్స్ కంపెనీ. ఇలా సిట్ దర్యాప్తు చేయనున్న ఈ 13 కేసులకు సంబంధించి మొత్తం రూ.84.87 కోట్ల విలువైన 22,947 మెట్రిక్ టన్నుల బియ్యం పట్టుబడినట్లు పోలీసులు గుర్తించారు. ఇందులో ద్వారంపూడి అనుచరులే అధికంగా ఉండడం గమనార్హం. అయితే క్షేత్రస్థాయిలో పక్కా ఆధారాలు భారీగా ఉండడంతో ఆయా కంపెనీలకు పోలీసులు నోటీసులు కూడా పంపించారు. అయితే సిట్ దర్యాప్తు ప్రారంభిస్తే ఈ కేసుల ఆధారంగా నిందితులను తక్షణం అరెస్ట్ చేయడంతోపాటు వాటి వెనుక ఉన్న పెద్దతలలు సైతం సులువుగా దొరికే అవకాశం ఉంది. కానీ సిట్ రంగంలోకి దిగలేదు.

అక్రమార్కుల్లో ఎంచక్కా దర్జా..

రేషన్ స్మగ్లింగ్‌పై ఏకంగా సిట్ విచారణకు ఆదేశించడంతో బియ్యం అక్రమార్కులు వణికిపోయారు. పైగా సిట్‌కు అరెస్ట్‌ల అధికారం కట్టబెట్టడంతో తమ పాపం పండినట్లేనని భయపడ్డారు. ఇంతవరకు దాని ఊసే లేకపోవడంతో తమకేం కాదులే అనే ధోరణిలో ప్రస్తుతం మళ్లీ రేషన్ బియ్యం కొనుగోళ్లు మొదలుపెట్టారు. వాస్తవానికి సిట్‌ను నియమించిన తర్వాత అందులో ఉన్న కొందరు సభ్యులు గత వైసీపీ ప్రభుత్వానికి అడ్డంగా కొమ్ము కాసిన వారేనన్న విమర్శలు వచ్చాయి. దీంతో వీరిని మార్చి ప్రభుత్వం డిసెంబరు 27న మరో కొత్త సిట్‌ను నియమించింది. అందులో కొందరు పోలీసులను తప్పించి కాకినాడ జిల్లాలో బీసీ కార్పొరేషన్ అధికారి శ్రీనివాస్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో పౌరసరఫరాల సంస్థ డీఎం బాలసరస్వతిని నియమించారు. ఇంతవరకు ఆ ఊసే లేదు. అటు కొత్త సిట్‌లో సభ్యులుగా ఉన్న ఇద్దరు ఉమ్మడి జిల్లా అధికారుల్లోను అయోమయం కొనసాగుతోంది. తమను దర్యాప్తు బృందంలో సభ్యులుగా చేర్చినా విచారణకు సంబంధించి ఎలాంటి సమాచారం లేకపోవడంతో వారు అయోమయంలో కొనసాగుతున్నారు.

జలకళకు నిధులు!



- ఏటిగట్లు, అవుట్‌ఫాల్ స్లూయిజ్‌లకు రూ.54.57 కోట్లు మంజూరు
- ఓఅండ్‌ఎం పనులకు రూ.70.01 కోట్లతో 953 ప్రతిపాదనలు
- నాబార్డు నిధులు రూ.257 కోట్లతో 322 పనుల ఆధునికీకరణ
- రబీకి నీటి ఎద్దడి లేకుండా ప్రయత్నం : ఇరిగేషన్ ఎస్ఈ కె.గోపీనాథ్

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ ప్రభుత్వం హయాంలో ఇరిగేషన్ వ్యవస్థను నిర్వీర్యమైంది. వేసవిలో కనీసం కాలువల్లో పూడిక కూడా తీయని పరిస్థితి ఉండేది. డెల్టా ఆధునికీకరణ పనులు అసలు పట్టించుకోలేదు. వరదల సమయంలో ఏటిగట్లకు తాత్కాలిక పనులకోసం కూడా నానా ఇబ్బందులుపెట్టేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇరిగేషన్ వ్యవస్థకు పూర్వవైభవం తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే వరదగట్ల అభివృద్ధి, అవుట్‌ఫాల్ స్లూయిజ్‌ల పటిష్టతకు రెండు విడతలుగా రూ.54.57 కోట్లు మంజూరు చేశారు. అందులో ఇప్పటికే కొన్ని పనులు ప్రారంభంకాగా, కొన్ని టెండర్ల దశలోనూ, కొన్ని సాంకేతిక అనుమతుల దశలోనూ ఉన్నాయి. ఇంకా అవుట్‌ఫాల్ స్లూయిజ్‌లతోపాటు గ్రోయిన్లు, డెల్టా ఆధునికీకరణ తదితర పనులకు రూ.257 కోట్ల నాబార్డు నిధులతో 322 పనులు ప్రతిపాదించి ప్రభుత్వానికి పంపించారు. అలాగే కాలువల క్లోజర్ సమయంలో ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓఅండ్‌ఎం) పనులు చేయడానికి రూ.70.01 కోట్లతో 953 పనులు ప్రతిపాదించారు. ప్రస్తుత ఇరిగేషన్ పరిస్థితి మీద ఇటీవల కొత్తగా బాధ్యతలు చేపట్టిన ధవళేశ్వరం ఇరిగేషన్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ కె.గోపీనాథ్‌తో 'ఆంధ్రజ్యోతి'తో పలు విషయాలు ప్రస్తావించారు.

● రబీ సాగుకు నీటి లభ్యత ఏంటి..

ఎస్ఈ : ఇబ్బంది ఉండదనే భావిస్తున్నాం. మొత్తం రబీ, మంచినీటి అవసరాలు, చేపల చెరువులకోసం 84 టీఎంలు అవసరం. ఇప్పటికే 41 టీఎంసీలు వినియోగించారు. ఇంకా మార్చి 31వ తేదీ వరకూ 43 టీఎంసీలు అవసరం. ప్రస్తుతం సీలేరు నుంచి 7,300 క్యూసెక్కుల నీరొస్తోంది. మొత్తం అక్కడ నుంచి 10 టీఎంసీల నీరు ఇస్తా మనే హామీ ఉంది. పోలవరం స్పిల్‌వే నుంచి 15 టీఎంసీలు వస్తాయి. సెల్ఫీల్డ్ 2.38 టీఎంసీలు ఉన్నాయి.

● మిగతా నీటికోసం యాక్షన్ ప్లాన్..

ఎస్ఈ : జిల్లా నీటిపారుదల అభివృద్ధి సంస్థ సమీక్ష నాటికి నీరు పుష్కలంగా ఉందనే అంచనాతో యాక్షన్ ప్లాన్ ఏమీ సిద్ధం చేయలేదు. సీలేరులో వాస్తవానికి 67 టీఎంసీల నీరు ఉంది. అవసరమైతే ప్రభుత్వ సహాయంతో మరికొంత తెచ్చే ప్రయత్నం చేస్తాం. నిజంగా శివారు ప్రాంతాల్లో ఎక్కడైనా ఎద్దడి వస్తే అప్పటికపుడు నిర్ణయాలు తీసుకోవడానికి కాకినాడ కలెక్టర్ సుముఖత తెలియజేశారు. మిగతా జిల్లాల కలెక్టర్లకు కూడా పరిస్థితిని వివరించి నీటి ఇంజన్లు ఏర్పాటు, క్రాస్‌బండ్‌ల నిర్మాణం వంటి పనులు చేస్తాం.

● క్లోజర్ సమయంలో కాలువల పనులకు యాక్షన్ ప్లాన్ ఏమైనా ఉందా?

ఎస్ఈ : 953 పనులు చేయడానికి రూ.70.01కోట్లతో ప్రతిపాదనలు పంపాం. వాటితో ఆపరేషన్, మెయింటెనెన్స్ పనులు చేస్తాం.

● వరదల సమయంలో ఈసారి ముఖ్య పనులు చేసే పరిస్థితి ఏమైనా ఉందా?

ఎస్ఈ : డిజాస్టర్ మేనేజ్‌మెంట్ నిధుల కింద ఇప్పటికే రెండు దఫాలుగా నిధులు మంజూరుచేశారు. మొదట విడతలో 37.57 కోట్లను 73 పనులు చేయడానికి ఇచ్చారు. వీటితో ఏటిగట్ల పటిష్టత, అవుట్‌ఫాల్ స్లూయిజ్‌ల అభివృద్ధి చేయనున్నాం. అంతేకాక పంపా నది స్పిల్‌వే గేట్లు రీప్లేస్‌మెంట్ పనులు కూడా ఉన్నాయి. ఈ పనులకు టెక్నికల్ శాంక్షన్ వచ్చిన వెంటనే టెండర్లు పిలుస్తాం. కాజ, నర్సాపురం ప్రాంతంలోని కాజ, మడుగుల తూము తదితర ప్రాంతాల్లో అవుట్‌ఫాల్ స్లూయిజ్‌లను మరమ్మతులు చేస్తాం. ఇవి టెండర్ల దశలో ఉన్నాయి. ఇటీవల డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కింద రెండో విడత రూ.17 కోట్లు వచ్చాయి. వాటితో రాజోలు సబ్ డివిజన్‌లో అంతర్వేది పరిధిలోనూ, లూటుకుర్రు, ఆదుర్రు అవుట్‌ఫాల్ స్లూయిజ్‌లు మరమ్మతులు చేయవలసి ఉంది. వీటికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలి.

● డెల్టా ఆధునికీకరణ పనులేమీ లేవా?

ఎస్ఈ : నాబార్డు నిధులు రూ.257 కోట్లతో 322 ఆధునికీకరణ పనులు చేయడానికి ప్రతిపాదించాం. వీటిలో చాలా అభివృద్ధి పనులను ప్రతిపాదించడం జరిగింది.

● అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగా పనిచేస్తున్న లస్కర్లకు జీతాల సమస్య..

ఎస్ఈ : నిధులు వచ్చాయి. ఈనెలాఖరుకి 2024-25కి సంబంధించిన మొత్తం బకాయిలు చెల్లిస్తాం. ఇక సమస్య ఉండదు.

విజిబుల్, ఫ్రెండ్లీ పోలీసింగ్‌కి ప్రాధాన్యం ఇవ్వాలి: ఎస్పీ

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): విజిబుల్, ఫ్రెండ్లీ పోలీసింగ్‌కి ప్రాధాన్యం ఇవ్వడంతోపాటు విద్యాలయాలు, హోటల్స్ వంటి ప్రదేశాల్లో నిఘా పటిష్టం చేయాలని ఎస్పీ నరసింహకిషోర్ ఆదేశించారు. గురువారం రాజమహేంద్రవరంలోని ప్రకాశ్‌నగర్ పోలీస్ స్టేషన్‌ని ఆయన తనిఖీ చేశారు. స్టేషను పరిసరాలను గమనించడంతోపాటు రికార్డులను పరిశీలించారు. స్టేషనుకు వచ్చే వారితో మర్యాదగా వ్యవహరించి సమస్యను పరిష్కరించే దిశగా సత్వర ప్రయత్నం చేయాలన్నారు. రాత్రి వేళల్లో గస్తీని పెంచాలని, బీట్ల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తుండాలని సూచించారు. రౌడీషీటర్ల కదలికలను గమనిస్తూ అవసరమైతే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించడం వంటివి చేసే వాళ్లను ఉపేక్షించవద్దన్నారు. స్టేషను పరిధిలోని నేరాలు, పురోగతి, దర్యాప్తులు వంటి అంశాలను ఎస్పీకి సీఐ బాజీలాల్ వివరించారు. అనంతరం సిబ్బంది సమస్యలను ఆరా తీసిన ఎస్పీ.. పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీఎస్పీ కె.రమేశ్ బాబు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

జిల్లాలో 40 వేల హెక్టార్లలో ప్రకృతి వ్యవసాయం సాగుకు చర్యలు

కలెక్టర్ పి.ప్రశాంతి

రాజమహేంద్రవరం రూరల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది 40 వేల హెక్టార్లలో ప్రకృతి వ్యవసాయం సాగు విస్తీర్ణం చేపట్టేలా చర్యలు చేపట్టి, ఆరోగ్యవంతమైన పంటల సాగు లక్ష్యంగా అడుగులు వేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతుల నుంచి అభిప్రాయాలను పంచుకున్నారు. ముందుగా ప్రకృతి వ్యవసాయం చేయాలంటూ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ మనం తీసుకునే ఆహారం ఆరోగ్యవంతంగా, ప్రయోజనకరంగా ఉండాలంటే ప్రకృతి సిద్ధంగా పండించే ఆహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ప్రకృతి వ్యవసాయం దిశగా అడుగులు వేసే ప్రక్రియలో మూడేళ్లపాటు ఓపికగా ఉంటే ఎరువుల ద్వారా పండించే పంటలకు ధీటుగా దిగుబడులు సాధించవచ్చన్నారు. భూమిని పరిరక్షించే దశగా ప్రకృతి వ్యవసాయ పద్ధతులు ఎంతగానో మేలుచేస్తుందని, భావితరాలకు మంచి ఆహారం అందించడం సాధ్యమవుతుందన్నారు. ఈ సందర్భంగా గోపాలపురంనకు చెందిన రైతు ఉండవల్లి రామకృష్ణ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతుల పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. దొమ్మేరుకు చెందిన సత్యనారాయణ అనే రైతు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానంలో అంతర పంటలు సాగు చేయడం ద్వారా అధిక దిగుబడులు, లాభాలు పొందవచ్చన్నారు. అలాగే 12 ఏళ్లుగా ప్రకృతి వ్యవసాయ విధానంలో ఎంతో సంతృప్తి పొందినట్టు ఉండ్రాజవరంనకు చెందిన రైతు మురళి తెలిపారు. వీరితోపాటు పలువురు తమ అభిప్రాయాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాయుడు, వ్యవసాయాధికారి మాధవరావు, జిల్లా హార్టీకల్చర్ అధికారి బి.సుజాత కుమారి, కేవీకే సమన్వయకర్త, శాస్త్రవేత్త డాక్టర్ యుఎస్ గోపాల్‌నాయుడు ప్రకృతి వ్యవసాయం సాగు చేసే రైతులు పాల్గొన్నారు.

బర్డ్‌ఫ్లూపై వదంతులు, అపోహలు నమ్మొద్దు!



- చికెన్, గుడ్లు వినియోగంపై జాగ్రత్తలు తీసుకోవాలి
- జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రబలిన బర్డ్‌ఫ్లూ (ఏవియన్ ఇన్‌ఫ్లుయెంజా)పై సోషల్ మీడియా, ఇతర ప్రసార మాధ్యమాల్లో వస్తున్న వదంతులు, అపోహలు నమ్మొద్దని, ఏ ఒక్కరూ భయపడాల్సిన పనిలేదని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరావు పేర్కొన్నారు. దీని నియంత్రణపై ప్రజలందరికీ అవగాహన కల్పించామని వెల్లడించారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ బర్డ్‌ఫ్లూ పక్షులకు మాత్రమే వస్తుందని, ప్రజలు తగిన జాగ్రత్తలు పాటిస్తే వైరస్ సోకదని స్పష్టంచేశారు. బర్డ్‌ఫ్లూ సోకిన ప్రాంతాల ప్రజలు ఆరోగ్యంగా ఉండటానికి మాత్రమే కాకుండా వైరస్‌వ్యాప్తిని అడ్డుకోవడానికి పలు జాగ్రత్తలు అవసరమని తెలిపారు. ఏదైనా జ్వరం, జలుబు, తలపోటు, ఒళ్లు నొప్పులు, కండరాల నొప్పులు వంటి లక్షణాలు వచ్చిన వెంటనే వైద్య సిబ్బందికి తెలియజేయాలని సూచించారు. పెరవలి, ఉండ్రాజవరం, నల్లజర్ల, చాగల్లు, నిడదవోలు, సీతానగరం మండలాల్లో మొత్తం 64 టీమ్స్ ద్వారా 22,902 ఇళ్లను సందర్శించి అందులో 87,724 ప్రజలకు రోగ లక్షణాలపై సర్వే చేశామని, ఎవరికీ ఎలాంటి లక్షణాలు లేవని ఆయన తెలిపారు. బర్డ్‌ఫ్లూ వెలుగుచూసిన ప్రాంతాల్లో వైద్య, ఆరోగ్యశాఖ డోర్ టు డోర్ నిఘా పెట్టిందని, పది కిలోమీటర్ల పరిధిలోని పీహెచ్‌సీలను తమ వైద్య బృందాలు కవర్ చేశాయని తెలిపారు. రోగ లక్షణాలున్న కేసులను గుర్తించడానికి, ఇంటింటి నిఘా కోసం ఆశాలు, ఏఎన్ఎంలు, సీహెచ్‌వోలతో కూడిన 64 వైద్య బృందాలను నియమించడం జరిగిందని తెలిపారు. ఏదైనా సమాచారం కోసం ఆరోగ్య సిబ్బందిని కానీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని కానీ సంప్రదించాలని ఆయన కోరారు.

ఈ జాగ్రత్తలు తీసుకోవాలి..

కోడిగుడ్లు, చికెన్ వినియోగానికి ముందు శుభ్రం చేయడంతోపాటు వంటకు తగిన జాగ్రతలు తీసుకోవాలని డాక్టర్ వెంకటేశ్వరరావు సూచించారు. ముడి మాంసం, హాఫ్ బాయిల్ చేసిన గుడ్లు తినకూడదని తెలిపారు. కోడిగుడ్లు చికెన్ చేతితో తాకినా ఆ తర్వాత బాగా చేతులు కడుక్కోవాలని, చికెన్, గుడ్లను వేర్వేరుగా నిల్వ చేయాలని, ఇతర ఆహార పదార్థాలతో కలపకూడదని పేర్కొన్నారు. కోళ్లు మరణించి ఉంటే వాటిని తగిన జాగ్రత్తలతో నిర్మూలన చేయాలని ఆయన వెల్లడించారు.

పౌల్ట్రీ ఫారాలు పరిశీలించిన రాపిడ్ రెస్పాన్స్ టీమ్

8

శ్రీసత్యసాయి తాగునీటి సరఫరా

నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి



గోపాలపురంలో క్లోరిన్ మీటరును చూపుతున్న మాజీ ఎంపీటీసీ ప్రసాదబాబు

గోపాలపురం, ఫిబ్రవరి 13, ఆంధ్రజ్యోతి : క్లోరినేషన్ లేకుండా తాగునీటిని సరఫరా చేస్తున్న శ్రీసత్యసాయి తాగు నీటి సరఫరా నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని మాజీఎంపీటీసీ కూనపం ప్రసాదబాబు డిమాండ్ చేశారు. గోపాలపురంలో ఉన్న శ్రీసత్యసాయి నీటి సరఫరా పంప్ హౌస్‌లో నీటిని శుద్ధి చేసేందుకు క్లోరిన్ ట్యాంకుకు అమర్చిన రెగ్యులేటర్ మీటర్‌ను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రసాద్‌బాబు మాట్లాడుతూ పంచాయతీ నుంచి ప్రజల దాహార్తి తీర్చేందుకు సరఫరా చేస్తున్న రక్షిత నీటిని ప్రజలు కేవలం గృహావసరాలకు మాత్రమే వినియోగిస్తున్నారని, కొన్ని రోజులుగా పైప్‌లైన్ ద్వారా సరఫరా అవుతున్న నీటి రుచిలో తేడా ఉన్నట్టు గుర్తించామని తెలిపారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజుకు కూడా చెబుతానని ఆయన హెచ్చరించారు.

ఖరీఫ్ సాగు ముందస్తు ప్రణాళికపై సమావేశం



జోగేంద్రప్రసాద్‌ను సత్కరిస్తున్న జిల్లా వ్యవసాయాధికారులు

గోపాలపురం, ఫిబ్రవరి 13, ఆంధ్రజ్యోతి: ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు సంబంధించి ముందస్తు ప్రణాళికపై కలెక్టర్ ప్రశాంతి ఆధ్వర్యంలో వ్యవసాయ ఉద్యాన ఏపీటీఎస్ఎఫ్ రైతుసాధికారిత సంస్థ సంబంధిత అధికారులతో గురువారం సమావేశాన్ని నిర్వహించారు. దీనికి ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తున్న రైతులను భాగస్వాములను చేశారు. రైతు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సాగు పద్ధతిని ఖర్చు ఆదాయం, ఇతర విషయాలపై రైతుల నుంచి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. గోపాలపురం, దేవరపల్లి మండలాల పరిధిలో గత కొన్నేళ్లుగా సేంద్రియ పద్ధతిలో సాగుచేస్తున్న గెడా జోగేంద్రప్రసాద్, గద్దే మునేశ్వరరావును జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు, ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ తాతారావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సంబంధిత శాఖాధికారులు పాల్గొన్నట్టు గడా జోగేంద్రప్రసాద్ తెలిపారు.

జవహర్‌ను కలిసిన ఎమ్మార్పీఎస్ నాయకులు



మాజీమంత్రి జవహర్‌ను దుశ్శాలువాతో సత్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కొవ్వూరు, ఫిబ్రవరి 13, ఆంధ్రజ్యోతి: టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీమంత్రి కేఎస్ జవహర్‌ను గురువారం ఎమ్మార్పీఎస్ నాయకులు ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా జవహర్ మాట్లాడుతూ త్వరలో జరగబోయే ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరానికి తమ మద్దతు తెలియజేయాలన్నారు. అనంతరం జవహర్‌ను దుశ్శాలువాతో సత్కరించారు. టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి యార్లగడ్డ రాజశేఖర్, కొత్తపల్లి రఘు, మద్దాల ఏసుపాదం, బోయినపల్లి కరుణాకర్, చాపల చినరాజు, తుత్తరపూడి రమణ, కొమ్ము సత్తిబాబు, చిడిపి స్టాలిన్, నేకూరి రవికుమార్, రాష్ట్ర తెలుగు రైతు కార్యనిర్వాహక కార్యదర్శి పసలపూడి సుభాష్ చంద్రబోస్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పుష్పోత్సవం

ధవళేశ్వరం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): జనార్దన స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి పుష్పోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం విశేష పూజలు అనంతరం సాయంత్రం ద్వాదశ అర్చనలు జరిపారు. రాత్రి ద్వాదశ ప్రదక్షిణలు, స్వామిఅమ్మవార్లను వివిధ రకాల పువ్వులతో అలంకరించారు. దంపతులకు తాంబూలాలు అందజేశారు. పుష్పోత్సవంతో స్వామివారి కల్యాణోత్సవాలు ముగిశాయి.

మంత్రిని కలిసిన ఎమ్మెల్యే ముప్పిడి

● అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని నారాయణకి వినతి



నారాయణను కలిసి సత్కరిస్తున్న కొవ్వూరు ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు

కొవ్వూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు మున్సిపాల్టీ అభివృద్ధికి నిధులు మంజూరు చేసి సహకరించాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మున్సిపల్ శాఖ మంత్రి నారాయణను కోరారు. గురువారం మంగళగిరిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రధానంగా పట్టణంలో నూతనంగా ఇచ్చిన నాలుగు కాలనీల్లో (జగనన్న) రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, విద్యుత్ దీపాలు వంటి మౌలిక సదుపాయాలు కల్పనకు ప్రత్యేక నిధులు మంజూరు చేయాలన్నారు. అలాగే 2027లో గోదావరి నదీ పుష్కరాలు వస్తున్నాయని, ప్రపంచం నలుమూలల నుంచి లక్షలాదిగా వచ్చే యాత్రికుల సౌకర్యార్థ కొవ్వూరు మున్సిపాల్టీలో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు అధికశాతం నిధులు కేటయించాలని కోరారు. ఎమ్మెల్యే వెంట మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, మద్దిపట్ల సురేష్, తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దేవరపల్లి, ఫిబ్రవరి 13, ఆంధ్రజ్యోతి : దేవరపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్టు నిడదవోలు విద్యుత్ శాఖ ఈఈ నారాయణ అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా ఉండదన్నారు. దేవరపల్లి, బంధపురం, గొల్లగూడెం వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఉండ్రాజవరం/పెరవలి: పెరవలి మండలంలోని పెరవలి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో పెరవలి, ముక్కామల, అజ్జరం, తీపర్రు, ఖండవల్లి, కొత్తపల్లి, నల్లాకులవారిపాలెం, కాపవరం, మల్లేశ్వరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని అన్నవరప్పాడు, మల్లేశ్వరం, కడింపాడు, పిట్టలవేమవరం గ్రామాల్లో చెట్టు నరికివేత, మెయిన్‌టెన్స్ పనుల్లో భాగంగా శుక్రవారం ఉదయం ఏడుగంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్టు ఈఈ ఎస్ఎస్ అప్పారావు గురువారం తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

కూటమి అభ్యర్థిని గెలిపించాలి



చిలకపాడులో ప్రచారం నిర్వహిస్తున్న కూటమి నాయకులు

ఉండ్రాజవరం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిని గెలిపించాలని చిలకపాడు, మోర్తలో కూటమి నాయకులు గురువారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి అభ్యర్థిగా బలపర్చిన పేరాబత్తుల రాజశేఖరానికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. రానున్న రోజుల్లో కూటమి ప్రభుత్వం మరిన్ని పథకాలను అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ, కూటమి నాయకులు కాకర్ల కరుణాకర్, అక్కిన గోపాలకృష్ణ, కాకర్ల నాని, కూటమి నేతలు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ర్యాంపు ఏర్పాటుపై ..

పర్యావరణ అభిప్రాయ సేకరణ



చిడిపిలో ఇసుక ర్యాంపుపై పర్యావరణ అభిప్రాయ సేకరణ సభ నిర్వహిస్తున్న అధికారులు

కొవ్వూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : గోదావరి చెంతనే ఉన్న గ్రామాలకు ట్రక్కు ఇసుక కూడా అందడం లేదని, ఎక్కడెక్కడి వారో వచ్చి బయట రాష్ట్రాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని చిడిపి గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తంచేశారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఇసుక ర్యాంపు ఏర్పాటుపై పర్యావరణ అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. దీనిపై గ్రామస్థులు మాట్లాడుతూ అఖండ గోదావరి నది చెంతనే ఉన్నప్పటికీ మాకు ట్రక్కు ఇసుక కూడా అందడం లేదని వాపోయారు. దీనివల్ల గ్రామ పంచాయతీలు తీవ్రంగా నష్టపోతున్నాయన్నారు. రాష్ట్రప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీని అమలుచేస్తున్నా ఏ ఎక్కరికీ క్షేత్రస్థాయిలో ఉచితంగా అందడం లేదన్నారు. ర్యాంపుల నిర్వాహకులు ట్రాక్టర్లు, ఎడ్లబళ్లను లోపలికి రానివ్వడం లేదన్నారు. దీనిపై ఏ ఒక్క అధికారి పట్టించుకోవడం లేదన్నారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి సీతారామ్మూర్తి మాట్లాడుతూ గ్రామస్థులు తెలియజేసిన విషయాలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తానని చెప్పారు.

కార్యక్రమంలో మైన్స్ ఏడీ ఫణిభూషణ్ రెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ ఎంబీఎస్ శంకరరావు, కొవ్వూరు తహసీల్దార్ ఎం. దుర్గాప్రసాద్, సర్పంచ్ పాలడుగుల లక్ష్మణరావు, పామెర్ల నగేష్, రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ అభివృద్ధికి కృషి చేయాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న నాగేంద్ర

తాళ్లపూడి, ఫిబ్రవరి 13, ఆంధ్రజ్యోతి: భారతీయ జనతా పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర పిలుపునిచ్చారు.గురువారం పార్టీ మండల సర్వసభ్య సమావేశం మండలాధ్యక్షుడు ఇందుగుల రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన నాగేంద్ర ముందుగా మండల నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపి పార్టీ విధివిధానాల గురించి వివరించారు. కార్యక్రమంలో బూసిబెనర్జీ, ఇమ్మణ్ణి అనసూయ, అరుణ, పి.లింగాచారి, చెల్లెంకుల రాధాకృష్ణ, కలిశెట్టి సన్యాసి నాయుడు, కిల్లాని రమణ, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు శిక్షణ తరగతులు



చాగల్లు: ఊనగట్లలో శిక్షణ తరగతిలో పాల్గొన్న అంగన్‌వాడీ సిబ్బంది



నల్లజర్ల : సమావేశంలో మాట్లాడుతున్న ఏసీడీపీవో పద్మావతి

చాగల్లు, ఫిబ్రవరి 13, ఆంధ్రజ్యోతి : బాల్యంలోనే (0 నుంచి 6 సంవత్సరాలు) పిల్లల పోషణ, మానసిక వికాసం పెంపొందే విధంగా పిల్లలకు తగిన చర్యలు తీసుకోవాలని ఎంఈవో - 2 సీహెచ్ సుభాకర్ అన్నారు. గురువారం ఊనగట్ల హైస్కూల్‌లో మార్కొండపాడు సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ సిబ్బందికి పోషణ్ బీ, పడా యి బీ పేరుతో అంగన్‌వాడీలకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నతనంలోనే పిల్లలకు శారీరక, మానసిక వికాసం కలిగించే విధంగా పౌష్టికాహారం అందించడంతో పాటుగా విద్యను కూడా అందివ్వాలనేది శిక్షణ ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ జి. శిరీష, సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీలు, తదితరులు పాల్గొన్నారు.

నల్లజర్ల: చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని ఏసీడీపీవో యూ. పద్మావతి అన్నారు. గురువారం నల్లజర్ల, పోతవరం హైస్కూల్‌లో పోషణ-బీ, పడాయి - బీపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్లు వెంకటలక్ష్మి, హారతి, కృష్ణవేణి, హెచ్ఎం కోమల చిత్ర, తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లి: బాల్యసంరక్షణ, విద్యను ప్రోత్సహించటం, బోధనావిధానాలపై పిల్లలకు అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ సీడీపీవో నాగలక్ష్మి అన్నారు. గురువారం యర్నగూడెంలో అంగన్వాడీ వర్కర్లు, టీచర్లకు మూడురోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండలంలోని 79 అంగన్వాడీ సెంటర్లు ఉన్నాయని, వాటిలో పోషణ బీ పడాయి బీ పై శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, విజయ శాంతి, ఎం.శశికళ, అంగన్వాడీ వర్కర్లు, టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: అంగన్‌వాడీ కేంద్రాలలో పౌష్టికాహార పంపిణీలో భాగంగా పోషన్‌బీ, పడాయిబీ అనే కార్యక్రమం నిర్వహణపై అంగన్‌వాడీ సిబ్బందికి గురువారం వేగేశ్వరపురం ఉన్నత పాఠశాలలో శిక్షణ ఇచ్చారు. ఐసీడీఎస్ ద్వారా ఈ పథకాన్ని ప్రభుత్వం - 2023 లోనే ప్రారంభించిందన్నారు. మూడురోజుల పాటు శిక్షణ ఉంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు భాగ్యకుమారి, భానుమతి తెలిపారు. మండలంలోని రెండు సెక్టార్ల నుంచి అంగన్‌వాడీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



దేవరపల్లి : సమావేశంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీవో నాగలక్ష్మి



తాళ్లపూడి: శిక్షణలో సూపర్‌వైజర్ భాగ్యకుమారి, భానుమతి

పౌల్ట్రీ ఫారాలు పరిశీలించిన రాపిడ్ రెస్పాన్స్ టీమ్



ఉండ్రాజవరంలో కోళ్లఫారాలను పరిశీలిస్తున్న టీమ్ సభ్యులు

ఉండ్రాజవరం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): పెరవలి మండలం కానూరు అగ్రహారంలో కోళ్లకు బర్డ్‌ఫ్లూ వచ్చిన నేపథ్యంలో అధికారుల ఆదేశాల మేరకు మండలంలోని పౌల్ట్రీఫారాలను రాపిడ్ రెస్పాన్స్ టీమ్ గురువారం పరిశీలించింది. కోళ్ల, ఇతర అంశాల వివరాలను సేకరించింది. మండలంలో ఎనిమిది గ్రామాల్లో పశు వైద్యాధికారుల మూడుబృందాలుగా ఏర్పడ్డాయి. కోళ్లఫారాల్లో కోళ్లకు వ్యాధులు ఉన్నవీ లేనివి, ఇతర అంశాల సేకరణతోపాటు కోళ్ల ఫారాల రైతులకు ముందుజాగ్రత్తల గురించి సూచించారు. నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు అందజేస్తామని పశువైద్యాధికారుల బృందం తెలిపింది. కార్యక్రమంలో ఏడీఏ ఎంఎస్ మూర్తి, పశువైద్యాధికారులు యు.ముఖేష్, పశుసంవర్ధక శాఖ సిబ్బంది జి.ముత్యాలరావు, జి. అంబేద్కర్, ఆర్. గౌతమ్ కుమార్, కె. దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పాలంగిలో ధ్వజ స్తంభ పునఃప్రతిష్ఠ



హోమక్రతువు నిర్వహిస్తున్న దృశ్యం

ఉండ్రాజవరం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): పాలంగి శ్రీ రామలింగేశ్వరస్వామి దేవస్థానం ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠాపనకు గురువారం అంకురార్పణ జరిగింది. బ్రహ్మశ్రీ కాళ్లకూరి కామేశ్వర శర్మ, బ్రహ్మశ్రీ వెలవలపల్లి చంద్రశేఖర్ శర్మ ఆధ్వర్యంలో చాపరాల కృష్ణ, రమణకుమారి దంపతులు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం ఉదయం ధ్వజ స్తంభ ప్రతిష్ఠ జరుగుతుందని కార్యక్రమానికి మంత్రి కందుల దుర్గేశ్, ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, తదితరులు హాజరు కానున్నారని నిర్వాహకులు తెలిపారు.

కాశీ నుంచి కన్యాకుమారి వరకు స్కేటింగ్



నల్లజర్లలో స్థానికులతో సోనీ చౌరసియా

నల్లజర్ల, ఫిబ్రవరి 13, ఆంధ్రజ్యోతి: గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డు కోసం ఆరోగ్య భారత్‌కు మొక్కలు పెంచాలనే నినాదంతో ఉత్తరప్రదేశ్‌కు చెందిన 34 సంవత్సరాల సోనీ చౌరసియా కాశీ నుంచి కన్యాకుమారి వరకు స్కేటింగ్ నిర్వహిస్తున్నారు. దాదాపు 20 రాష్ట్రాల మీదుగా 10 వేల గ్రామాలతో పాటు 113 రోజుల యాత్ర కొనసాగుతుందని ఆమె గురువు రాజేష్ డోగ్రా తెలిపారు. బుధవారం రాత్రి నల్లజర్లలో టీడీపీ నాయకుడు విడియాల శ్రీను ఇంటి వద్ద వారికి వసతి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధి, అభిరుచులు, సంస్కృతీ సంప్రదాయాలను ప్రత్యక్షంగా వీక్షించేందుకు ఈ యాత్ర ప్రారంభించినట్టు చెప్పారు. మామిడి అశోక్ కుమార్, గన్నిన శ్రీనివాసరావు, గుదె సుబ్బారావు, సవలం రామకృష్ణ పాల్గొన్నారు.

అందుబాటులో యూజీ, పీజీ కోర్సులు

కొవ్వూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : దూర విద్యావిధానంలో యూజీ, పీజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయని ఏయూ మేనేజర్ రహంతుల్లా అన్నారు. కొవ్వూరు పట్టణంలోని సెయింట్ జేమ్స్ పాఠశాలకు గురువారం ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యూజీ, పీజీ కోర్సులతో పాటు ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు అప్రంటిషిప్ ఇంటెన్సివ్ ద్వారా ఉపాధి, సర్టిఫికెట్స్ పొందే అవకాశం ఉందన్నారు. జీకే అకాడమీ డైరెక్టర్ గెల్లా కేశవ మాట్లాడుతూ చదువుకోవాలనే కోరిక ఉన్నవారికి దూర విద్యలో ఆన్లైన్ విధానం చక్కని మార్గమన్నారు. ప్లేస్‌మెంట్‌తో కూడిన ఈ అవకాశాన్ని కొవ్వూరు పట్టణ పరిసరాల ప్రాంతాలకు చెందినవారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సీహెచ్ శ్యామలరావు, విద్యార్థులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి స్థలంలో కంటైనర్ బాక్సు

నల్లజర్ల, ఫిబ్రవరి 13, ఆంధ్రజ్యోతి: నల్లజర్లకు చెందిన షేక్ జాన్ బాజీ కుమారుడు చంద్‌షాకి చెందిన ఇంటిస్థలంలో కవులూరుకు చెందిన వ్యక్తి అతని అనుచరులతో కలిసి కంటైనర్ బాక్సు పెట్టి ఆక్రమించడంపై గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుధవారం రాత్రి ఆ స్థలంలో కంటైనర్ పెట్టేందుకు ప్రయత్నించగా... స్థానికులు అడ్డుకున్నారు. అయినప్పటికీ బాక్సును పెట్టారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా వారి వచ్చి తొలగించినట్టు బాధితుడు చెప్పాడు.

అన్న క్యాంటీన్ పరిసరాలు దుర్గంధం



నిడదవోలులో అన్న క్యాంటీన్ పక్కన చెత్తతో నిండి ఉన్న కాలువ

● పట్టించుకోని నిడదవోలు మున్సిపల్ అధికారులు
● ప్రజలకు తప్పని ఇక్కట్లు

నిడదవోలు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): పేదల ఆకలి తీర్చే దేవాలయం అన్న క్యాంటీన్. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.5కే పేదలకు కడుపు నిండా నాణ్యమైన భోజనం అందిస్తోంది. ఈ ఆహారాన్ని అందించే అన్న క్యాంటీన్ పరి సరాలు అపరిశుభ్రంగా మారి దుర్గంధం వెదజల్లుతున్నా.. మున్సిపల్ అధికారులు అటువైపు కనీసం కన్నెత్తి కూడా చూడక పోవడం శోచనీయం. నిడదవోలులోని గణేష్‌చౌక్ సెంటర్‌కు సమీపంలోని ప్రధాన మార్గంలో ఉన్న అన్న క్యాంటీన్‌ను ఆనుకుని ఉన్న భీమదారు తూము (డ్రైనేజీ) చెత్తాచెదారాలతో నిండి ఉండడంతో దోమలకు ఆవాసంగా మారిపోయింది. మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

కలుపు మందు తాగి.. వివాహిత ఆత్మహత్య

● ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఇద్దరు పిల్లలు



మృతురాలు దుర్గాభవాని

చాగల్లు, ఫిబ్రవరి 13, ఆంధ్రజ్యోతి : ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వివాహిత పిల్లలతో సహా కలుపుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనలో ఆమె మృతిచెందగా, పిల్లలు ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వివరాలివి... చిక్కాల గ్రామానికి చెందిన బొర్రా దుర్గాభవాని (35)కి సురేంద్రగౌడ్‌తో పదమూడేళ్ల క్రితం పెళ్లైంది. వీరికి జోత్స్న రత్నశ్రీ (11), జయదీప్ (9) పిల్లలు ఉన్నారు. భర్త లారీడ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అయితే కొంతకాలంగా కుటుంబంలో ఆర్థికసమస్యలు మొదలయ్యాయి. దీంతో ఆమె తరచూ మానసిక వేదనకు గురయ్యేది. విషయం తెలుసుకున్న ఆమె అన్నయ్య వారిని తన ఇంటికి తీసుకుని వెళ్లాడు. ఈ క్రమంలో భర్త డ్యూటీలో భాగంగా హైదరాబాద్‌కు వెళ్లాడు. దీంతో ఎవరూ లేని సమయంలో ఇంటి వద్ద ఉన్న కలుపు మందును పిల్లలకు ఇచ్చి ఆమె కూడా తాగింది. దీన్ని గమనించిన బంధువులు వైద్యం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా దుర్గాభవాని మార్గ మధ్యలో మృతిచెందింది. పిల్లలు ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతురాలి అన్నయ్య రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ కే.నరేంద్ర తెలిపారు.

కోళ్లఫారాల వద్ద శానిటేషన్ పనులు చేపట్టాలి

● యజమానుల సమావేశంలో తహశీల్దార్ అచ్యుతకుమారి



పెరవలిలో కోళ్లఫారాల యజమానులతో మాట్లాడుతున్న తహసీల్దార్ అచ్యుతకుమారి

ఉండ్రాజవరం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): కోళ్లఫారాల వద్ద శానిటేషన్ పనులు ముమ్మరంగా చేపట్టాలని తహశీల్దార్ డీ. అచ్యుతకుమారి పేర్కొన్నారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మండలంలోని కోళ్లఫారాల యజమానులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోళ్లఫారాల వద్ద బతికి ఉన్న, మరణించిన కోళ్లను, గుడ్లను ఇతర ప్రాంతాలకు తరలించరాదన్నారు. అలాగే చెరువులు, కాలువల్లో వేయరాదని సూచించారు. ప్రతిరోజు ఉదయం, మధ్యాహ్నం శానిటేషన్ చేయాలని చెప్పారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు చరణ్, సాల్మ, తదితరులు పాల్గొన్నారు.